అదనపు గదుల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ కృష్ణారెడ్డి




నెల రోజుల్లో భవనాలు పూర్తి చేయాలి

● ఏపీఎంఎస్ఐడీసీ సీఈ సుధాకర్‌రెడ్డి

మదనపల్లె టౌన్, జనవరి 29: మదనపల్లె మెడికల్ కాలేజీకి అనుబంధంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి మొదటి అంతస్థులో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణం నెల రోజుల్లో పూర్తి చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ సీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద జరుగుతున్న నిర్మాణాలను ఎస్ఈ కృష్ణారెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇంటర్నల్‌గా నిర్మాణం పూర్తి కావస్తోందని, మిగిలిన పనులు నెల రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. కాగా మెడికల్ కాలేజి నిర్వహణకు కంప్యూటర్లు , ఇతర సామాగ్రి వచ్చిందని వీటిని నిర్వహించేందుకు భవనం లేక ఇబ్బందిగా ఉందని మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు ఇంజనీర్ల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సీఈ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రి ఆవరణలోనే ఉన్న డీఈఐసీ భవనం ఖాళీగా ఉందని అందులో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌కు తెలిపారు. బ్లడ్ బ్యాంకు ప్లాస్మా పరీక్ష చేసే యంత్రం అందుబాటులోకి తీసుకురావాలని వైద్యులు సీఈని కోరారు. అనంతరం అరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కాలేజి భవనాలను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి, అక్కడి కాంట్రాక్టర్లకు తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ డీఈ కరీముల్లాఖాన్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, టీసీఈ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బిక్కుబిక్కుమంటున్న ఆ 12 మంది!





● ఒంగోలు తరువాత ఉన్నది పీలేరు ఫైలేనంటూ ప్రచారం
● ఏ క్షణంలోనైనా ఉత్తర్వులు రావొచ్చంటూ పుకార్లు
● ప్రస్తుత అధికారుల్లోనూ ఉత్కంఠ

పీలేరు, జనవరి 29: 'మొన్న కలెక్టరు, నిన్న ఆర్డీవో, రేపు పీలేరు ఆఫీసర్లు. కలెక్టరుకు సస్పెన్షన్, ఆర్డీవోకు డిమోషన్, వీరికి ఊస్టింగ్ ఉంటుందేమో. ఒంగోలు ఫైలు తరువాత పీలేరు ఫైలు సిద్ధంగా ఉందంట. ఈరోజో రేపో అధికారికంగా అనౌన్స్ చేస్తారట. అప్పుడేమో రూలింగ్ పార్టీవాళ్లు ఏం చెబితే అది చేశారు. ఇప్పుడేమో బిక్కుబిక్కుమంటున్నారు.' చేసిన తప్పులకు జిల్లాలోని ఉన్నతాధికారులు ఎదుర్కొంటున్న శిక్షలు, అదే కోవలోకి వచ్చే పీలేరుకు చెందిన 12 మంది రెవెన్యూ అధికారులపై పీలేరులో వినిపించిన మాటలు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పీలేరుతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, డీకేటీ భూములు అన్యాక్రాంతమైన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై సోమవారం పీలేరులో పెద్దఎత్తున చర్చ జరిగింది. ప్రకాశం జిల్లా సదావర్తి భూములకు సంబంధించిన ఉదంతంలో మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళి డిమోషన్ ఎదుర్కోవడం, ఇంచుమించు అటువంటి వ్యవహారంలోనే పీలేరు అధికారులు కూడా ఉండడంతో వారిపై ఎటువంటి చర్యలు ఉంటాయోనన్న చర్చలు పెద్దఎత్తున జరిగాయి. వారిపై ఇప్పటికే నిర్ణయం అయిపోయిందని, నేడో రేపో వారిపై తీసుకున్న చర్యలు బహిర్గతం కావొచ్చన్న ఊహాగానాలు వినిపించాయి. ఆర్డీవో ఉదంతంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు అధికారులు కూడా తమలో తాము మాట్లాడుకుంటూ ఏ చర్యలకైనా సిద్ధంగా ఉండాల్సిందేనని నిట్టూరుస్తుండడం విశేషం.

ఆరోపణలు ఎదుర్కొంటున్న 12 మంది అధికారులు

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పీలేరు పట్టణ శివార్లతో పాటు దానికి ఆనుకుని ఉన్న ఎర్రగుంటపల్లె, ముడుపులవేముల, దొడ్డిపల్లె, బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె పంచాయతీల్లో సుమారు 600 ఎకరాల ప్రభుత్వ, డీకేటీ భూములు అన్యాక్రాంతమై ప్రభుత్వానికి వందల కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, డీకేటీ భూముల నిబంధనల అతిక్రమణ జరుగుతున్నా పట్టించుకోకపోవడమే కాకుండా ఆక్రమణదారులకు సహకరించేలా వ్యవహరించారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. అప్పట్లో పీలేరులో తహసీల్దార్లుగా పనిచేసిన వి.పుల్లారెడ్డి, కె.వెంకటరమణ, ఆర్ఐలుగా పనిచేసిన ఎస్.అబ్దుల్‌ఖాదర్, ఎన్.భార్గవి, వీఆర్వోలుగా పనిచేసిన కె.శ్రీనివాసులు, ఎం.శాంతకుమార్ రెడ్డి, ఎం.ప్రసాద్ బాబు, పి.రవిప్రసాద్, ఎల్.నవీన్ కుమార్, కె.మురళీకృష్ణ, ఎస్.సురేశ్ కుమార్ రెడ్డి, కె.శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాల్సిందేనని 06.06.2022ను సీసీఎల్ఏ ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. అప్పటికే వారు పీలేరు నుంచి బదిలీ అయిపోయి ఉండడంతో అవి పెండింగ్‌లో పడ్డాయి. పీలేరుకు చెందిన ప్రజాప్రతినిధుల ఒత్తిడి కారణంగా ఆ ఆదేశాలు అమలులో జాప్యం జరుగుతోందన్న వాదనలు కూడా ఇంతకాలం వినిపించాయి. అయితే ఇటీవల రెవెన్యూ శాఖలోని పెండింగ్ కేసుల పరిష్కారంలో భాగంగా పీలేరు కేసును కూడా తిరగతోడారని, వారం రోజుల క్రితం అంటే మదనపల్లె ఆర్డీవో వ్యవహారం విచారణ జరుగుతున్నప్పుడే పీలేరుకు చెందిన అధికారులను కూడా లిఖితపూర్వక సంజాయిషీ కోసం సీసీఎల్ఏ కార్యాలయానికి పిలిపించారనే గుసగుసలు సోమవారం పీలేరులో వినిపించాయి. తమను కాపాడమని అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఉన్నతాధికారుల చుట్టూ తిరిగి ఎటువంటి సాయం అందక విసిగిపోయి ఉన్న చాలామంది ఆ సంజాయిషీ ఇచ్చేందుకు కూడా వెళ్లలేదని తెలిసింది. దీంతో మరింత ఆగ్రహోద్రిక్తులైన సీసీఎల్ఏ అధికారులు వారిపై చర్యలు తీసేసుకున్నారని, ప్రకాశం జిల్లా ఉదంతం అయిపోయినందున ఇక తరువాతి వంతు పీలేరుదేనని స్థానిక అధికారులు చెవులు కొరుక్కోవడం కనిపించింది.

కిశోర్‌కుమార్ రెడ్డి ఆరోపణలతో వెలుగులోకి..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పీలేరుతో పాటు గూడరేవుపల్లె, బోడుమల్లువారిపల్లె, దొడ్డిపల్లె, ఎర్రగుంట్లపల్లె ముడుపులవేముల గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు 600 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని 2021లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు యధేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడమే కాకుండా అనధికార లేఔట్లు వేసి సుమారు రూ.400 కోట్లు గడించారని కిశోర్ సంచలన ఆరోపణలు చేశారు. గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్ వంటి సాంకేతి క ఆధారాలతో వాటిపై రాష్ట్ర లోకాయుక్తకు కూడా ఫిర్యాదు చేశారు. ఈలోపు ప్రభుత్వం అప్పట్లో మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా ఉన్న యువ ఐఏఎస్ అధికారిణి జాహ్నవి నేతృత్వంలో 60 మంది సిబ్బందితో కూడిన విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. సుమారు రెండు నెలలు విచారించిన తరువాత 600 ఎకరాల భూమిలో నిబంధనల అతిక్రమణ జరిగినట్లు విచారణ బృందాలు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. అంత పెద్ద ఎత్తున నిబంధనల అతిక్రమణ, ప్రభుత్వ భూముల ఆక్రమణ, డీకేటీ భూముల క్రయవిక్రయాలు జరుగుతున్నా పట్టించుకోనందున 12 మంది అధికారులపై చర్యలు కూడా తీసుకోవాలని సబ్‌కలెక్టర్ సిఫార్సు చేశారు. ఆక్రమణలను సైతం తొలగించేందుకు ఆమె చర్యలు తీసుకుని కొన్నిచోట్ల ఎక్స్‌కవేటర్ల సాయంతో వాటిని తొలగించారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న అధికారపక్ష నేతలు ఆక్రమణల తొలగింపు పను ల న ం అడ్డు కు ని సాయం కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వద్దకు పరుగులు తీశారు. దీంతో వారు ఆమెను హుటాహుటిన మదనపల్లె నుంచి బదిలీ చేయించేసి, ఆమె ఇచ్చిన నివేదిక కలెక్టర్ స్థాయిలోనే అణిచివేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను పీలేరు నుంచి వివిధ ప్రాంతాలకు బదిలీ చేయించి చేతులు దులుపుకున్నారు. అయితే ఈ విషయంపై కిశోర్‌కుమార్ రెడ్డి విలేఖరుల సమావేశాలు, బహిరంగ వేదికల్లో పదేపదే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వచ్చారు. దీంతో వాటి గురించి మాట్లాడక తప్పని పరిస్థితి అధికారపక్షానికి ఎదురైంది. 2009 నుంచి 2022 వరకు పీలేరు ప్రాంతంలో జరిగిన ఆక్రమణలపై సీఐడీతో విచారణ జరిపించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. ఆయన విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకునేలోపే లోకాయుక్త, సీసీఎల్ఏ నివేదికలు వెలువడ్డాయి. ఆక్రమణలు జరిగింది వాస్తవమేనని ఆ రెండు సంస్థలూ నిర్ధారించి అప్పట్లో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ 12 మందిపై చర్యలు తీసుకోవాల్సిందేనని ప్రభుత్వానికి సిఫార్సు చేశాయి.

జూనియర్ సివిల్ జడ్జిగా ప్రశాంత్



పీలేరు, జనవరి 29: పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్‌కు చెందిన పల్లెపాగు ప్రశాంత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. రాష్ట్ర హైకోర్టు విడుదల చేసిన ఫలితాల్లో శ్రీనాథ్ ఎంపికైనట్లు సోమవారం వర్తమానం అందింది. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ రాష్ట్ర హైకోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న శ్రీనాథ్, హైదరాబాదులోని ఉస్మానియాలో న్యాయవిద్య అభ్యసించారు. ఆయన తండ్రి పల్లెవాగు శ్రీనాథ్ ఏపీపీగా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ప్రశాంత్‌ను సోమవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు గండికోట వెంకటేశ్, తదితరులు అభినందించారు.

షర్మిలపై పోస్టింగులు పెట్టడం దారుణం

● పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి

పులివెందుల టౌన్, జనవరి 29: వైఎస్ షర్మిల రెడ్డి కాదు, శాస్త్రి అంటూ పోస్టింగులు పెట్టడం దారుణమని, ఇంత చేస్తుంటే సొంత అన్న పట్టించుకోకపోవడం అన్యాయమని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. సోమవారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షర్మిల ప్రతి సమావేశంలోను అన్న జగన్ మోసం చేశాడని దానికి సాక్ష్యం మా అమ్మే అని చెబుతున్నారన్నారు. కానీ షర్మిల చెప్పేవి అన్నీ అబద్ధాలు అని వైఎస్ జగన్ తన తల్లి విజయమ్మతో చెప్పిస్తాడా అని ప్రశ్నించారు. అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నువ్వానేనా అన్న రీతిలో తలపడుతున్న ఛతీస్‌గఢ్, ఉత్తరాఖండ్ జట్లు



ఉత్సాహంగా బాలికల కబడ్డీ పోటీలు

● 27 రాష్ట్రాల నుంచి క్రీడాకారిణులు
● కోలాహలంగా క్రీడా ప్రాంగణం

రాజంపేట, జనవరి 29: రాజంపేటలో రెండు రోజులుగా కొనసాగుతున్న జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ క్రీడాపోటీలు ఉత్సాహంగా, ఉత్కంఠంగా కొనసాగుతున్నాయి. దేశంలోని 27 రాష్ట్రాల జట్లు ఈ పోటీల్లో పాల్గొనడంతో ఇన్‌ఫెంట్ స్కూల్ క్రీడా ప్రాంగణం క్రీడాకారులతో కళకళలాడుతోంది. ఆహ్లాదకర వాతావరణంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం ప్రారంభమైన ఈ పోటీల్లో 6వ మ్యాచ్‌గా విద్యాభారతి, బిహార్‌ల మధ్య హోరాహోరీగా కబడ్డీ పోటీలు సాగగా 4 పాయింట్లతో బిహార్ జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్ పంజాబ్, వెస్ట్‌బెంగాల్ మధ్య పోటీ జరగా 5 పాయింట్లతో పంజాబ్ జట్టు విజయం సాధించింది. 8వ మ్యాచ్‌గా జమ్మూ, తమిళనాడు జట్లు తలపడగా ఏకంగా 63 పాయింట్లతో తమిళనాడు విజయం సాధించింది. 9వ మ్యాచ్‌లో కేరళ, ఛండీగఢ్ జట్లు తలపడగా 34 పాయింట్లతో కేరళ జట్టు విజయం సాధించింది. 10వ మ్యాచ్‌లో భాగంగా హర్యానా, కర్ణాటక జట్లు తలపడగా హర్యానా 66 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 11వ మ్యాచ్ విద్యాభారతి, కేవీఎస్ జట్ల మధ్య జరగగా 11 పాయింట్ల జట్టుతో విద్యాభారతి విజయం సాధించింది. సీఐఎస్‌సీఈ, ఏపీ జట్లు తలపడగా 54 పాయింట్లతో ఆంధ్రా జట్టు విజయం సాధించింది. ఈ విధంగా వివిధ రాష్ట్రాల మధ్య కబడ్డీ పోటీలు నువ్వా.. నేనా అన్న రీతిలో కొనసాగుతున్నాయి.



ఉత్కంఠంగా సాగుతున్న సీఐఎస్‌సీఈ, ఆంధ్రప్రదేశ్ జట్ల మ్యాచ్

ఎన్నిసార్లు శంకుస్థాపనలు చేస్తారు?

● బీజేపీతో మీ దోస్తీ.. దేనికైనా పనికి వచ్చిందా..
● స్టీలు ఫ్యాక్టరీ వచ్చిందా..
● కడప-బెంగళూరు రైల్వేమార్గం వద్దంటూ లేఖ రాశారు
● మెయింటెనెన్స్ లేక అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి..
● 40 మంది ప్రాణాలు కోల్పోయారు
● కడప జిల్లా పట్ల జగనన్నకు ప్రేమ ఉందని ఎలా నమ్మాలి
● కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం
● తరలివచ్చిన కార్యకర్తలు



కడప, అన్నమయ్య జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కడప, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): 'జగనన్న ప్రతిపక్ష నాయకుడి హోదాలో ప్రత్యేక హోదా, ఇతర హామీల కోసం దీక్షలు చేశారు. కడప స్టీలు ఫ్యాక్టరీ కోసం దీక్షలు చేశారు. ఇప్పుడు జగనన్న ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడైనా కడపకు స్టీలు ఫ్యాక్టరీ వచ్చిందా అంటే అది కూడా రాలేదు. శంకుస్థాపనలకే పరిమితమయ్యారు. ఒకదాని తరువాత ఒకటి ఎన్నిసార్లు శంకుస్థాపనలు చేస్తారు? బీజేపీతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు కదా. అటువంటప్పుడు మరి మీ దోస్తీ స్టీలు ఫ్యాక్టరీకైనా పనికొచ్చిందా" అంటూ జగన్ సోదరి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. సోమవారం కడప నగరశివారులో పులివెందుల రోడ్డులోని జయరాజ్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉమ్మడి వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ కడప జిల్లాపై దివంగత రాజశేఖర్‌రెడ్డి తన అభివృద్ధి మార్కు చూపించారన్నారు. కడప జిల్లావాసులను వైఎస్ ఎంతగానో ప్రేమించేవారన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల కోసం 25వేల మందికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా దాదాపు లక్షమందికి ఉపాధి వచ్చేదన్నారు. చంద్రబాబు హయాంలో 18 వేల కోట్లతో స్టీలు ఫ్యాక్టరీ కోసం శంకుస్థాపన చేశారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగనన్న కడప స్టీలు ఫ్యాక్టరీ కోసం దీక్షలు చేశారని గుర్తు చేశారు. సీఎం అయిన తరువాత స్టీలు ఫ్యాక్టరీని శంకుస్థాపనల ఫ్యాక్టరీగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. ఒకదాని తరువాత ఒకటి ఎన్నిసార్లు శంకుస్థాపన చేస్తారని ప్రశ్నించారు. పోనీ ప్రాజెక్టు వచ్చిందా అంటే అదీ లేదు, బీజేపీతో దోస్తీ కనీసం దేనికైనా పనికి వచ్చిందా జగనన్నా అంటూ ప్రశ్నించారు. స్టీలు ఫ్యాక్టరీ తెచ్చుకోవడం కూడా చేతకాలేదంటే ఇక కడప జిల్లాపై నీకు ప్రేమ ఉందని ఎలా నిరూపించుకుంటావని ప్రశ్నించారు.

బంగారు గాజులు ఇచ్చి మట్టిగాజులు అడిగారు

రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కడప నుంచి బెంగళూరు రైల్వే లైను కోసం కేంద్రంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని, ఆయన హయాంలోనే 25 కిమీ రైల్వే లైను పూర్తయిందని అన్నారు. అయితే జగన్ సీఎం అయిన తరువాత ఒక్క మీటరు కూడా పనిచేయలేదన్నారు. మాకు ఈ ప్రాజెక్టు అవసరం లేదు అంటూ ఒక లేఖ రాశారని, ఒక చిన్న రైల్వే లైను అడిగారని అన్నారు. ఇది బంగారు గాజులు ఇచ్చి మట్టి గాజులు తెచ్చుకున్నట్లు ఉందన్నారు. అయినా ఆ చిన్న రైల్వే లైను కూడా రాలేదన్నారు.

సర్కారు పాపాలకు ప్రజలు బలి

అన్నమయ్య ప్రాజెక్టు మెయింటెనెన్స్ చేయకపోవడం వల్లనే గేటు తెగి వరదల్లో 40 మంది మృత్యువాత పడ్డారన్నారు. 450 కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయని, పశువులు ఇతరత్రా కోట్లలో నష్టం జరిగిందని అన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. సర్కారు చేసిన తప్పులు, పాపాలకు ప్రజలు బలి అయిపోతే ఎలా అని ప్రశ్నించారు. కడప జిల్లా పట్ల జగన్‌కు ప్రేమ ఉందని ఎలా నమ్మడం.. ఎలా విశ్వసించడం అంటూ వైఎస్ షర్మిల మండిపడ్డారు.

జగన్‌పై నేరుగా అటాక్

నా పేరు వైఎస్ షర్మిలారెడ్డి.. నాన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగనన్న పుట్టిన జమ్మలమడుగులోనే నేనూ పుట్టాను. రాష్ట్రమంతా ఒక ఎత్తు. కడప జిల్లా ఒక ఎత్తు. ఇది నా గడ్డ అంటూ షర్మిల మాట్లాడ్డంతో కార్యకర్తల నుంచి అనూహ్య స్పందన లభించింది. రాజశేఖర్‌రెడ్డి కడప జిల్లా అభివృద్ధిపై తన మార్కు చూపించుకున్నారు. మరి జగనన్న ఏం చేశారంటూ ఆమె జగన్‌పై నేరుగా అటాక్ చేశారు. రాజశేఖర్‌రెడ్డి మతతత్వ బీజేపీకి వ్యతిరేకమని, ముస్లింల కోసం 4 శాతం రిజర్వేషన్ ఇచ్చారని, మరి జగనన్న బీజేపీతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ కడప జిల్లాకు అవసరమైన స్టీలు ఫ్యాక్టరీ, రైల్వేలైను గురించి ఎందుకు ప్రశ్నించలేదంటూ షర్మిల చేసిన వ్యాఖ్యలకు మంచి స్పందన వచ్చింది. నాది, జగనన్నది ఒకటే రక్తం. అయితే అప్పటి జగనన్న వేరు, ఇప్పటి జగనన్న వేరు అంటూ షర్మిల చేసిన వ్యాఖ్యలు జనాల్లోకి బాగా వెళ్లాయి.. స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్‌లో షర్మిలా టూర్ కదలిక తీసుకువచ్చి జోష్ నింపింది. భవిష్యత్తుపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఒక భరోసా వచ్చినట్లయింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రఘువీరారెడ్డి, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, జేడీ శీలం, ఇతర ముఖ్యులు హాజరయ్యారు. సమావేశం కూడా దివంగత మాజీమంత్రి వివేకానందరెడ్డి ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి బారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు

● ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 29: జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలపై నిరక్ష్యం చూపరాదని.. ఎప్పటికప్పుడు నాణ్యతగా వాటిని పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు డీఆర్వో సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారులు సంతృప్తిచెందేలా నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి వారు వినతులను స్వీకరించారు.

రిజిస్ట్రేషన్‌లను వెంటనే ప్రారంభించాలి

● రాష్ట్ర భూపరిపాలన శాఖ కమిషనర్ సాయిప్రసాద్

జిల్లాలోని అన్ని సచివాలయాల్లో జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌లను వెంటనే ప్రారంభించాలని, ఇందుకు తగిన కార్యాచరణ చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్ అంశంపై విజయవాడ నుంచి రాష్ట్ర భూ పరిపాలనశాఖ కమిషనర్ సాయిప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు డీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూపరిపాలనశాఖ కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి రెండో వారంలో ముఖ్యమంత్రి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల పత్రాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ల అంశాన్ని కలెక్టర్లు ప్రాధాన్యతగా తీసుకొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 68వేల మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరందరికీ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఈనెల 30వ తేదీ మంగళవారం ప్రతి సచివాలయంలో కనీసం ఒక్క టెస్ట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ఫిబ్రవరి 9లోపు రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయాలన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

వైసీపీ ప్రభుత్వ అరాచకానికి త్వరలో స్వస్తి

● రాబోయే కురుక్షేత్ర యుద్ధంలో టీడీపీదే ఘన విజయం
● పెద్దిరెడ్డీ మతిభ్రమించి మాట్లాడితే ఊరుకోం
● టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట/ఒంటిమిట్ట, జనవరి 29: వైసీపీ దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందని జగన్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఆ ప్రభుత్వానికి ఇక మిగిలింది 73 రోజులేనని వచ్చే కురుక్షేత్ర యుద్ధంలో టీడీపీ ఘన విజయం సాధించి అధికారం చేపట్టడం తథ్యమని టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం రాజంపేటలోని పార్లమెంటు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్‌రెడ్డి పరిపాలనకు స్వస్తి పలకడానికి యువకులు, రైతులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వైసీపీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. ఎన్నికలకు ముందు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంటూ ఉత్తుత్తి ప్రేమలు పలికిన జగన్‌మోహన్‌రెడ్డి నేడు దళిత అభ్యర్థులను మార్చడం ఏమిటని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి అరాచక విధానాలపై ల్యాండ్, శ్యాండ్ దోపిడీలపై సత్యవేడు దళిత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వ్యాఖ్యలపై సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎర్రచందనంతో మీకున్న సంబంధం నిజం కాదా... మీ ఆత్మీయుడైన ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి వైసీపీ టికెట్టు కేటాయించడమే ఇందుకు నిదర్శనం కాదా అని పెద్దిరెడ్డిపై విమర్శలు గుప్పించారు. సమావేశంలో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, పార్లమెంటు కార్యనిర్వహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, తులసినాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మతిభ్రమించి చంద్రబాబుపై నోరుజారి మాట్లాడితే చూస్తూ ఊరుకోమని రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సోమవారం సాయంత్రం ఒంటిమిట్టలోని హరిత హోటల్‌లో టీడీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పీలేరులో జరిగిన జన సునామీని చూసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మతిభ్రమించి చంద్రబాబుపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు అరాచకాలపై ప్రజల్లోవ్యక్తమైన వ్యతిరేకత కళ్లకు కట్టినట్లు కనపడిందన్నారు. పుంగనూరు, అంగళ్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించడం తప్ప తమ రాష్ట్ర ప్రజల కోసం ఏం చేశామన్నది పెద్దిరెడ్డికి తెలియదన్నారు. రాజంపేట పార్లమెంటు పరిధిలో తండ్రీకొడుకులు పదవులు కోసం తప్ప రాజంపేట పార్లమెంటు అభివృద్ధి ఏ మేరకు చేశారని ఆయన విమర్శించారు. సమావేశంలో టీడీపీ నాయకులు చలమయ్య యాదవ్, లక్ష్మీనారాయణ నాయుడు, హరినాథ్, శివారెడ్డి, డాక్టర్ శివ, హుస్సేన్ పీరా, మోదుగుల నరసింహులు, బి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కంటైనర్ ఇరువురు మృతి



మృతి చెందిన రమణ ఆచారి, బ్రహ్మయ్య ఆచారి, రోదిస్తున్న బంధువులు

రాజంపేట టౌన్, జనవరి 29 : రాజంపేట బోయనపల్లె సమీపంలోని వైజంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. వరుసకు బావ, బావమరిదిలు అయిన రమణ ఆచారి(52), బ్రహ్మయ్య ఆచారి (56) ఇరువురు రాజంపేట నుంచి కడప వైపు గుండ్లూరు అన్నగారిపల్లెకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తిరుపతి వైపు వెళుతున్న కంటైనర్ వీరిని ఢీకొంది. దీంతో ఇరువురు కింద పడిపోవడంతో తలలు పగిలి అక్కడికక్కడే మృతి చెందారు. రోడ్డుపై మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. అదే సమయంలో రాజంపేటకు వస్తున్న టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తన వాహనాన్ని ఆపి ఘటనాస్థలం వద్ద పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించారు. మన్నూరు సీఐ మంజునాథరెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. రోడ్డుపై మృతదేహాలు పడిపోవడంతో కడప-చెన్నై ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి మృతుల బంధువులు చేరుకొని విలపించారు.

ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య



బడిగించల దేవి మృతదేహం

జమ్మలమడుగు, జనవరి 29: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో సోమవారం బడిగించల దేవి (16) అనే బాలిక ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మృతురాలు బడిగించల దేవి తల్లి పది సంవత్సరాల క్రితం చనిపోయింది. తండ్రి బడిగించల జగన్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. పెద్ద కుమార్తెకు వివాహం కాగా రెండో కుమార్తె దేవి ఇంటి వద్దనే చేనేత మగ్గం నేస్తోంది. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అయితే బాలిక మృతికిగల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ చేస్తున్నారు. బాలిక ఉరి వేసుకుని మృతి చెందిందా.. లేక ఇంటిలోకి ఎవరైనా వచ్చి ఆమెను కొట్టి ఉరి వేశారా తదితర కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ మురళీయాదవ్ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు మృతి



కాళ్ల విశ్వ మృతదేహం

ఎర్రగుంట్ల, జనవరి 29: మండలంలోని చిలమకూరు ఐసీయల్ కాలనీ గేటు సమీపంలో సోమవారం లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొన్న సంఘటనలో కాళ్ల విశ్వ (16) అక్కడికక్కడే మృతి చెందాడు. చిలమకూరు ఎస్సీ కాలనీకి చెందిన విశ్వ అతని తండ్రి రవి మోటార్‌సైకిల్‌లో ముద్దనూరు వైపు వెళుతున్నాడు. చిలమకూరు ఐసీయల్ గేటు వద్ద ముద్దనూరు వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో విశ్వ లారీ టైర్ల కిందపడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రవికి కుమారుడు, కుమర్తె ఉన్నారు. ఏఎస్ఐ రాజారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



ఎర్రగుంట్ల, జనవరి 29: ఎర్రగుంట్ల మహాత్మానగర్‌కు చెందిన వనం బయమ్మ (43) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బయమ్మకు ముగ్గురు సంతానం. కుటంబ కలహాల వల్లే ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ షైను ద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

అదృశ్యమైన తల్లి పిల్లల ఆచూకీ లభ్యం

చిన్నమండెం, జనవరి 29: మండలంలోని చాకిబండ కుమ్మరపల్లెకు చెందిన భార్గవి తన ముగ్గురు పిల్లలతో ఈనెల 23వ తేదీ అదృశ్యమైన విషయం తెలిసిందే. భార్గవి తల్లి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ రమేశ్‌బాబు వీరి ఆచూకీ కనుగొన్నట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. భర్త తరఫు బంధువులతో మనస్పర్థలు వచ్చి మనస్థాపంతో భార్గవి ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. మన స్పర్థలను పరిష్కారం చేసుకోవాలి కానీ, ఇంటి నుంచి వెళ్లిపోవడం సరైన పద్ధతి కాదన్నారు. భార్గవి వెళ్లిపోవడానికి సహకరించి తరువాత ఏమి తెలియనట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్గవి తల్లి కృష్ణవేణికి ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపినట్లు తెలిపారు.

నిర్లక్ష్యం ఖరీదు... గేటు మీదపడి చిన్నారి మృతి



చిన్నారి మృతికి కారణమైన గేటు, మృతి చెందిన సాకేత్ అభినవ్‌రెడ్డి

పులివెందుల రూరల్, జనవరి 29: అభం శుభం తెలియని ఆ చిన్నారికి మృత్యువు ముందుందని తెలియదు. ఆడుకునేందుకు వెళ్లిన పదినెలల బాలుడిపై ఆలయం గేటు మీదపడడంతో మృత్యువాతపడ్డాడు. గేటు ఏర్పాటులో నిర్లక్ష్యమే చిన్నారి బాలుడు మృతికి దారితీసింది. ఆదివారం సాయంత్రం పులివెందులలో ఈ హృదయవిదారక ఘటన జరిగింది. చిన్నారిని చూసి వారు అయ్యోపాపం అంటూ ఆవేదన చెందారు. బాలుడి బంధువులు, తల్లిదండ్రుల వివరాల మేరకు....పట్టణంలోని గజ్జల అశోక్‌రెడ్డి, హిమజల కుమారుడు సాకేత్ అభినవ్‌రెడ్డి. ఆదివారం సాయంత్రం వాకింగ్ చేస్తూ సేదతీరేందుకు శ్రీమహాలక్ష్మి ఆలయం కాంపౌండ్ వద్ద కూర్చున్నారు. వారి కుమారుడు పది నెలల సాకేత్ అభినవ్‌రెడ్డి ఆడుకుంటూ గేటును పట్టుకోవడంతో అది ముందుకు రోల్ అయి ఒక్కసారిగా చిన్నారిపై పడింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. ఈ సంఘటనపై బాలుని బంధువులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సాధారణంగా రోలింగ్ గేట్ ఏర్పాటుచేసేటపుడు పూర్తిస్థాయిలో రెండు వైపుల స్టాపింగ్ కీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అటువంటి పనులు ఇక్కడ చేయకపోవడంతో అభం శుభం తెలియని బాలుడు మృతిచెందినట్లు తెలిపారు.

రాజోలి ముంపువాసులను నిండా ముంచిన జగన్

- జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి
- పాదయాత్రకు భారీగా హాజరైన టీడీపీ శ్రేణులు



పాదయాత్రగా వస్తున్న భూపేష్‌రెడ్డి, నాయకులు

పెద్దముడియం, జనవరి 29 : రాజోలి ముంపువాసులను జగన్ సర్కారు నిండా ముంచిందని టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి విమర్శించారు. పెద్దముడియం మండలంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాజోలి ముంపువాసులకు మద్దతుగా భూపేష్‌రెడ్డి పాదయాత్ర ప్రారంభించారు. మొదట పెద్దముడియం గ్రామంలో టీడీపీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని గ్రామదేవతల ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి ఇతర టీడీపీ నాయకులకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం భూపేష్‌రెడ్డి పెద్దముడియం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. పెద్దముడియం, పాలూరు, చిన్నముడియం, గరిశలూరు మీదుగా భారీ జనసందోహం మధ్య నెమ్మళ్లదిన్న గ్రామానికి పాదయాత్ర చేరుకుంది. నెమళ్లదిన్నె గ్రామంలో జరిగిన బహిరంగసభలో భూపేష్ మాట్లాడుతూ సొంత జిల్లా సీఎం అయి ఉండి కూడా రాజోలి విషయంలో రైతులను నిండా ముంచాడని, గండికోట నిర్వాసతులకు అన్యాయం చేశాడని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ముంపువాసులకు మెరుగైన ప్యాకేజీ తెప్పిస్తామని టీడీపీ అధినేతచంద్రబాబు కూడా ముంపువాసులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చాడని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమరానికి సిద్ధం కావాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లింగారెడ్డి మాట్లాడుతూ ఈ సైకో ప్రభుత్వాన్ని సాగనంపాలని రైతులకు అన్నివిధాల అన్యాయం చేశాడని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు శివనాథరెడ్డి, నారాయణరెడ్డి, మండల నాయకులు రామసుబ్బారెడ్డి, చక్రపాణిరెడ్డి, హుసేన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీసీలు సంఘటితంగా పోరాడాలి

- రాజ్యసభ సభ్యుడు క్రిష్ణయ్య

కడప(రూరల్) జనవరి 29 : బీసీలు సంఘటితంగా పోరాడినప్పుడే హక్కులను సాధించుకోగలమని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య పేర్కొన్నారు. ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం 2024 డైరీ, క్యాలండర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటికీ బీసీలకు రాజ్యాంగపరమైన హక్కులు రాకపోవడం దారుణమన్నారు. చాలా మంది బీసీలకు ఫీజురీయింబర్స్‌మెంట్ అందడం లేదన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలన్నారు. దేశంలో సామాజిక వివక్షత, ఆర్థిక అసమానతలు పోవాలంటే బీసీ విద్యావంతులు, ఉద్యోగులు నాయకత్వ బాధ్యతను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, నాయకులు చిన్నబాబు, మురళీమోహన్, చలపతి, గంగాదర్‌రావు, జెన్‌కో అధ్యక్ష, కార్యదర్శులు విశ్వరూపచారి, కోదండరామ్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లకు తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్

ఎర్రగుంట్ల, జనవరి 29: ఎర్రగుంట్లకు తమిళ సూపర్‌స్టార్ రజనికాంత్ సోమవారం వచ్చారు. ఆయన జువారి సిమెంట్ ఫ్యాక్టరీలోని గెస్ట్ హౌస్‌లో రెస్ట్ తీసుకుంటున్నారు. మంగళవారం ఉదయం నిడుజువ్వి పరిసరాల్లోని గనుల్లో జరిగే షూటింగ్‌లో పాల్గొనేందుకు వచ్చినట్లు సమాచారం. అయితే ఆయన్ను కలిసేందుకు ఎవ్వరికీ అనుమతిలేదని రజనీకాంత్ వ్యక్తిగత సిబ్బంది తెలిపారు. ఆయన రాక సందర్భంగా భద్రతను ఏర్పాటు చేశారు.

వైయస్ఆర్ ఈయుకి బైబై చెప్పిన ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపు ఉద్యోగులు



ఈ.యూ తీర్థం పుచ్చుకున్న దృశ్యం

కడప (మారుతీనగర్) జనవరి 29: కడప నగర శివారు ప్రాంతంలో గల ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో వైయస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు చెందిన ఉద్యోగులంతా మూకుమ్మడిగా ఆ అసోసియేషన్‌కు సోమవారం రాజీనామాలు సమర్పించారు. అనంతరం నాన్ ఆపరేషన్ రీజనల్ కార్యదర్శి ఎస్.అంకిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపు తాలూకు కాంప్లెక్స్‌లో ఏకైక యూనియన్‌గా ఎంప్లాయిస్ యూనియన్ నిలిచింది. ఈ సందర్భంగా ఎస్.అంకిరెడ్డి మాట్లాడుతూ నిబద్ధతకు నిలువుటద్దంగా నిలిచిన ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరిన జోనల్ వర్క్‌షాపు ఉద్యోగుల సేవలకు తగిన గుర్తింపుతో పాటుగా గౌరవం దక్కేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు జీవీ నరసయ్య, నాగరాజు, రంగనాథ్, జోనల్ నాయకులు రాజశేఖర్, నారాయణ, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవినాయక్, తదితరులతో పాటు మూడు యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, కాంప్లెక్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణ విద్య పరీక్షలు తప్పనిసరిగా రాయాలి



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య

రాయచోటిటౌన్, జనవరి 29: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఫిబ్రవరి 2, 3వ తేదీల్లో జరగబోయే నైతిక మానవ విలువలు, పర్యావరణ విద్య అనే అంశాలపై జరిగే పరీక్షలను తప్పనిసరిగా రాయాలని ఇంటర్మీడియట్ విద్య అన్నమయ్య జిల్లా అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సోషియల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, ప్రైవేటు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతన్న విద్యార్థులు పర్యావరణ విద్య, నైతిక, మానవ విలువలు సబ్జెక్ట్ విధిగా రాయాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 2న నైతిక, మానవ విలువలు పరీక్ష, ఫిబ్రవరి 3వ తేదీ పర్యావరణ విద్య అంశంపై పరీక్ష జరుగుతుందన్నారు. ప్రశ్నాపత్రం ఇంటర్మీడియట్ బోర్డు జ్ఞానభూమి లాగిన్‌లో ఉంటుందన్నారు. మూల్యాంకనం సమీప కళాశాల అధ్యాపకులచే జరపుతారన్నారు. పరీక్ష అనంతరం అదే రోజు విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్సర్ పేపర్లు జిల్లా ఇంట ర్మీడియట్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ రెండు పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా పరీక్షలు నిర్వహించాలని ఆయన ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు.

పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి విద్యార్థి దశ కీలకం

- పరీక్షపే చర్చకు ప్రతి స్పందన సఫల్తాకా రస్తా
- నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ శరణి



మాట్లాడుతున్న నారాయణ విద్యాసంస్థల డైరక్టరు శరణి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 29: పోటీ ప్రపంచాన్ని అధిగమించాలంటే విద్యార్థి దశ కీలకమైనదని నారాయణ విద్యాసంస్థల డైరెక్టరు శరణి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రూపొందించిన పరీక్షపే చర్చ కార్యక్రమానికి ప్రతి స్పందనగా నారాయణ విద్యాసంస్థలు సఫల్తాకా రస్తా కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు దిశ నిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అలాగే విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచుకునేందుకు ఇదో చక్కటి అవకాశమని సూచించారు. సోమవారం కడప నగరం బీఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సఫల్తాకా రస్తా కార్యక్రమం నిర్వహించారు. అకడమిక్ ఎక్సలెన్స్ సమగ్రాభివృద్ధిని పెంపొందించడానికి అంకితమై వినూత్నమైన సఫల్తాకా రస్తా సక్సెస్ విజయవంతమైన రెండో ఎడిషన్‌ను సగర్వంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఈ ఈవెంట్‌ను భారతదేశమంతటా విస్తరించడం జరిగిందని చెప్పారు. అనంతరం విద్యార్థుల సందేహాలు పరిష్కరించడానికి, విషయాలపై స్పష్టత అందించేందుకు చర్చ నిర్వహించారు. అంకితమైన కెరీర్‌గైడెన్స్ ద్వారా విద్యార్థులు వారి భవిష్యత్తు కోసం ప్లాన్ చేస్తున్నప్పుడు వారికి ఎదురవుతున్న అనేక సమస్యలపై కూలంకుషంగా విద్యార్థులకు వివరించారు. అలాగే సఫల్తాకా రస్తా కార్యక్రమమే కాకుండా భావి లక్ష్యాలు నిర్దేశించేందుకు ఇదోక గొప్ప వేదిక అన్నారు. విద్యార్థులకు తమ స్థాయిని మెరుగుపరచుకోవడానికి విజయం వైపు మార్గాలను సుగమం చేసేందుకు ఇదోక సువర్ణఅవకాశమన్నారు. కార్యక్రమంలో ఏజీయంలు రాజు, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, నజీర్, ఆర్ఐలు రామక్రిష్ణ, శర్మ, కిరణ్‌కుమార్, మల్లిఖార్జున, ఆర్అండ్‌డీ హెడ్‌లు నరేష్, కోఆర్డినేటర్లు ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జ్‌లు, ఏవోలు, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

9 వికెట్ల తేడాతో ఆంధ్రా జట్టు విజయం



ధరణికుమార్ నాయుడు (ఆంధ్రాజట్టు), దీపక్ యాదవ్ (ఛత్తీస్‌గఢ్)

కడప (స్పోర్ట్స్), జనవరి 29: కల్నల్ సీకేనాయుడు మల్టీడే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ ఆంధ్రా జట్టు సోమవారం 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వివరాల్లోకి వెళితే..... టాస్ నెగ్గిన ఛత్తీస్‌గఢ్ జట్టు (ఆదివారం) తొలుత బ్యాటింగ్‌కు దిగి 46.2 ఓవర్లలో కేవలం 152 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఆంధ్రా జట్టు బౌలింగ్ విభాగంలో టి.విజయ్ 5 వికెట్లు పడగొట్టగా మరో బౌలర్ వాసు 3 వికెట్లు పడగొట్టి స్వల్ప స్కోర్‌కే ఛత్తీస్‌గఢ్ జట్టును కట్టడిచేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రాజట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. దీంతో ఆంధ్రా జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 47 పరుగుల ఆధిక్యత లభించింది. ఇందులో ధరణికుమార్‌నాయుడు 82 పరుగులతో, వాసు 36 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. ఓవర్‌నైట్ స్కోర్ 82 పరుగులతో సోమవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు మరో 9.3 ఓవర్లపాటు మొత్తంగా 55.3 ఓవర్లు బ్యాటింగ్ చేసి 239 పరుగులకు ఆలౌట్ అయింది. ధరణికుమార్ నాయుడు (బ్యాటర్) 88 పరుగులు, వాసు (బ్యాటర్) 52 పరుగులు చేశారు. కాగా ఛత్తీస్‌గఢ్ బౌలింగ్ విభాగంలో దీపక్ యాదవ్ (బౌలర్) 7 వికెట్లు పడగొట్టడం విశేషం. తదుపరి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టు కేవలం 23 ఓవర్లలోనే 99 పరుగులు చేసి చేతులెత్తేసింది. దీంతో ఛత్తీస్‌గఢ్ జట్టుకు 12 పరుగుల స్వల్ప స్కోర్ మాత్రమే ఆధిక్యత లభించింది. విజయమే ధ్యేయంగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రాజట్టు 2.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 13 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది

విద్యుదుత్పత్తిలో అత్యుత్తమ ఫలితాలు

- ఆర్టీపీపీకి అవార్డు
- ఘనస్వాగతం పలికిన ఉద్యోగులు



సీఈకి మెమెంటోను అందజేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జనవరి 29: మండలంలోని కలమల్ల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీకి ఏపీ జెన్‌కో విద్యుదుత్పత్తిలో అత్యుత్తమ ఫలితాలను సాధించినందుకు అవార్డును గెలుచుకుంది. రిపబ్లిక్ డే రోజున ఆర్టీపీపీ సీఈ నాగరాజు జెన్‌కో ఎండీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. సోమవారం ఆయనకు ఆర్టీపీపీ ఉద్యోగులు, కార్మికులు, కాలనీవాసులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కాలనీ ఫౌంటేన్ నుంచి ప్లాంటు వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవార్డుపై ప్రసింగించారు. అందరి కృషి వల్లే ఈఅవార్డు దక్కిందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీపీపీ ఎస్ఈలు, డీఈలు, ఇతర అధికారులు, అన్ని యూనియన్స్‌కు చెందిన నాయకులు, ఉద్యోగ కార్మికులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



రోడ్డు భద్రతపై వివరిస్తున్న అటవీశాఖ అధికారి సందీప్ రెడ్డి

సికెదిన్నె, జనవరి 29: రహదారి భద్రత అందరి బాధ్యత అని జిల్లా అటవీశాఖ అధికారి టీవీ సందీప్‌రెడ్డి తెలిపారు. ఉపరవాణాశాఖ కార్యాలయం ఊటుకూరులో డాక్టర్ తేజ ఆధ్వర్యంలో పుష్పగిరి ఐ ఆస్పత్రి వారి సహకారంతో డ్రైవర్లకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. డ్రైవర్ చేతిలో ఎంతో మంది ప్రాణాలు ఆధారపడి ఉంటాయని.. ఏమాత్రం ఒంట్లో నలతగా ఉన్నా డ్రైవింగ్ చేయరాదన్నారు. వేగాన్ని అదుపులో ఉంచుకుని వాహనాన్ని నడపడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే అతని కుటుంబం మొత్తంపై ప్రభావం చూపుతుందని.. కుటుంబమంతా రోడ్డుపాలు అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు రహదారి భద్రతపై శ్రద్ధ చూపాలన్నారు. ఉపరవాణా కమిషనర్ నీలాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవడంతోపాటు ఇతరులు సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకునే విధంగా చూడాలన్నారు. అందుకు రోడ్డు భద్రత నియమాలే శ్రీరామ రక్షగా ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కంటి వైద్య, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, లక్ష్మీప్రసన్న, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అత్యంత ఆవశ్యకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వాసంతి రాజేంద్రన్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 29 : ఆన్‌లైన్ సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగిస్తున్న యువతకు సైబర్ సెక్యూరిటీ పట్ల అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంటు కెపాసిటీ బిల్డింగ్ విభాగాధిపతి ప్రొఫెసరు వాసంతి రాజేంద్రన్ అన్నారు. తమిళనాడు శ్రీపెరుంబుదూర్ రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యట్ ఆఫ్ యూత్ డెవల్‌మెంటు భారత ప్రభుత్వ యువజన క్రీడల వ్యవహారాల మంత్రిత్వశాఖ వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై యువతకు అవగాహన కల్పించే దిశగా మాస్టర్ ట్రైనర్లకు మూడురోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా వాసంతి రాజేంద్రన్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగం లో సమాజాన్ని సైబర్ క్రైం నుంచి రక్షించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రధానంగా యువత డిజిటల్ పరికరాలు ఉపయోగిస్తూ ఇంటర్నెట్ సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం వెచ్చిస్తున్నందు వల్ల సైబర్ సెక్యూరిటీ పట్ల అవగాహన అవసరమన్నారు. దీంతో పాటు మరి కొన్నిసూచనలను తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ప్రొఫెసర్ అనిత, ఎస్పీ వెంకటరమణ, డాక్టర్ సునీత, డాక్టర్ శ్రీనివాసరావు, కె.లలిత, రాజగోపాల్‌రెడ్డితో పాటు వివిధ డిగ్రీ జూనియర్ కళాశాలల ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి



బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 29: వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి తమ విన్నపాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులకు విన్నవించారు. జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, యదుభూషణ్‌రెడ్డి, ప్రత్యూషలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టి.. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు ఉండాలన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కడప (క్రైం), జనవరి 29 : బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడి స్పందన కార్యక్రమంలో బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైం బారిన పడ్డ బాధితుల ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీసు అధికారులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలకు సైబర్ క్రైంకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్ క్రైం.గౌ.ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో మరియు టోల్ ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు అదనపు ఎస్పీ సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నందలూరు, జనవరి 29: విద్యార్థులు పౌష్టికాహారం ఆవశ్యకతను తెలుసుకోవాలని ప్రభుత్వ వైద్యుడు కార్తీక్ విశ్వనాథ్ సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డాక్టర్ అనిమియా, అధ్యాపకులు సురేష్, సమత, వసంత్, శైలజ, ఆదిలక్ష్మి, కేశవులు పాల్గొన్నారు.

మేడాతో యల్లటూరు భేటీ

నందలూరు, జనవరి 29 : రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేత మేడా విజయశేఖర్‌రెడ్డిని సోమవారం జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి సన్మానించారు. అదే విధంగా శ్రీనివాసరాజును మేడా విజయశేఖర్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, జెడ్పీ మాజీ కో-ఆప్షన్ మెంబర్ షబ్బీర్ అహమ్మద్, గురివిగారి వాసు, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

రైల్వేకోడూరు(రూరల్) జనవరి 29: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రైల్వేకోడూరు తహసీల్దార్ రామ్మోహన్ హెచ్చరించారు. పట్టణంలోని ఉంగరాల నగర్ వద్ద వంక పోరంబోకు స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడను సోమవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతో, ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. ఇది ఇలా ఉండగా ప్రహరీ గోడ నిర్మించి రెండేళ్లవుతున్నా పట్టించుకోని అధికారులు హుటాహుటిన కూల్చడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశానికి తరలిన నాయకులు

సుండుపల్లె, జనవరి 29: కడప, అన్నమయ్య జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి మండలం నుంచి భారీగా తరలివెళ్లినట్లు ఆ పార్టీ నేత గాజుల భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుండుపల్లెతోపాటు రాజంపేట, నందలూరు, సిద్దవటం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అభిమానుల కోసం ప్రత్యేకంగా కార్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ సమావేశానికి తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పరామర్శ

చిన్నమండెం, జనవరి 29: పీలేరులో జరిగిన రా.. కదలిరా కార్యక్రమం సందర్భంగా ప్రమాదం కారణంగా అస్వస్థతకు గురైన మండలంలోని కొత్తపల్లి రోడ్డుకు చెందిన గౌనిపల్లె వెంకటనాగులను రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

వీరభద్రాలయంలో పల్లకి ఉత్సవం

రాయచోటిటౌన్, జనవరి 29: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళి, వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి, వివిధ పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పల్లకిపై ఆశీనులను చేసి మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఈవో రమణారెడ్డి ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

స్కూటర్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

సంబేపల్లె, జనవరి 29: స్కూటర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. నారాయణరెడ్డిపల్లె కస్పాకు చెందిన శ్రీరాములు తన ద్విచక్రవాహనంలో రాయచోటి నుంచి స్వగ్రామానికి వెళుతూ.. సుద్దలవాండ్లపల్లె క్రాస్ వద్ద రోడ్డు దాటుతున్న మహిళను తప్పించబోయి అదుపు తప్పి కింద పడడంతో గాయపడ్డాడు. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 29: మదనపల్లెలోని ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలని బహుజన యువ సేన అధ్యక్షుడు పునీత్ జాయింట్ కలెక్టర్, డీఎం హెచ్‌వోకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటళ్లలో వైద్యం పేరుతో పేద ప్రజలను దోచుకుంటున్నారని, వారి భయాన్ని క్యాష్ చేసుకుంటూ వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశారని ఆరోపించారు. ముఖ్యంగా మదనపల్లెలోని రెయిన్‌బో చిన్నపిల్లల హాస్పిటల్‌లో ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా బిల్డింగ్ ఐసీయూ చేస్తూ హాస్పిటల్ నిర్వహిస్తున్నారన్నారు. రెయిన్‌బో హాస్పిటల్‌కి ప్రభుత్వ రికగ్నైజేషన్ లేదని, అక్కడ పనిచేస్తున్న వారు సర్టిఫైడ్ స్టాఫ్ కాదని, వ్యాధితో సంబంధం లేకుండా పిల్లల్ని ఐసీయూలో ఉంచాలని తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురిచేసి వారి దగ్గర వేలకు వేలు డబ్బులు గుంజుకుంటున్నారని ఆరోపించారు. ఆధ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేసినా డబ్బులు గుంజుకుంటున్నారని వారు ఆరోపించారు. వీరిపైన కఠినమైన చర్యలు తీసుకొని అనాథరైజ్డ్ హాస్పిటల్స్‌ను వెంటనే మూయించి, ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన్ యువసేన నాయకులు విద్యాసాగర్, శ్రీనాథ్, పూర్ణ, నందీష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకుంటున్న జగన్

● టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు

రైల్వేకోడూరు, జనవరి 29: రాష్ట్ర ప్రజలను, వనరులను ఐదేళ్లుగా ఏపీ సీఎం దోచుకున్నాడని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు ఆరోపించారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేని ఏపీ సీఎంకు కౌంట్ డౌన్ మొదలైందన్నారు. ఆయనను సాగనంపేందుకు రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు కంకణం కట్టుకున్నారన్నారు. సీఎం అహంకారానికి, వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. 2021లో వెంట్రుక కూడా పీకలేరని, 2022లో నన్నే నమ్మండని, 2023లో మిమ్మల్నే నమ్ముకున్నానని, 2024 లో హ్యాపీగా దిగిపోతా అంటున్న ఏపీ సీఎం మాటల్లో ఎంత తేడా కనిపిస్తుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంపై రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారం ఉందన్నారు. వైసీపీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథ నాయుడు

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్టుబడిదారులను రకరకాలుగా ఇబ్బందులు పెట్టి తరిమేశాడన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ నాయకులు కమతం నాగరాజుయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, దళిత నాయకుడు పుల్లెల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

నందలూరు, జనవరి 29: రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే జనసేన, టీడీపీతోనే సాధ్యమవుతుందని మాజీ జెడ్పీటీసీ యల్లటూరు శివరామ రాజు తెలిపారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా సోమవారం నూకినేనిపల్లె, బలిజపల్లె, బలిజపల్లె ఎస్సీ కాలనీ, కుంపినీపురంలలో ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ జనసేన పార్టీ ఎన్నికల గుర్తు గాజు గ్లాసు ప్రజలకి చేరువైందన్నారు. జెడ్పీటీసీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు షబ్బీర్ అహమ్మద్, విశ్రాంత ఎస్ఐ కడిమెళ్ల శ్రీనివాసరాజు, నాయకులు ఆకుల చలపతి, భారతాల ప్రశాంత్, గురివిగారి వాసు, తిప్పాయపల్లె ప్రశాంత్, వెలకచర్ల హరిబాబు, మంటి వెంకటసుబ్బయ్య, బత్యాల వినయ్, పైడికొండ్ల సునీల్ గౌడ్, నందు, వెంకటేష్, బాలాజీ, సుధాకర్, రవీంద్ర, కార్తీక్, శ్రీను, యానాది, రాము



నందలూరు: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

పాల్గొన్నారు.

జనసేనతోనే మార్పు సాధ్యం

సుండుపల్లె: జనసేన, టీడీపీ కలయికతో రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుందని జనసేన నాయకులు వంటేరు రాజా, సలీం తెలిపారు. మండలంలోని రాయవరం పంచాయతీ కావలిపల్లెలో సోమవారం జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీతోనే మార్పు సాధ్యమని తెలిపారు. అసెంబ్లీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకట్రమణ ఆధ్వర్యంలో జీ. రెడ్డివారిపల్లె, గుండ్లపల్లెల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించినట్లు ఆ పార్టీ నాయకురాలు సుగుణమ్మ తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు పాల్గొన్నారు.



జీ. రెడ్డివారిపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

వైసీపీ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

సుండుపల్లె, జనవరి 29: వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్ తెలిపారు. సోమవారం సుండుపల్లె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ఇసుక, మట్టి అమ్ముకొని ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు అభివృద్ధి చెందారు. కానీ ప్రజలకు ఎటువంటి మంచి జరగలేదని విమర్శించారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పథకాలుగా అందించి ప్రజలను మోసం చేస్తున్నారని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 9నుంచి నిర్వహించనున్న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాయుడు, వెంకట్రామరాజు, వెంకట్రమణనాయుడు, నరేంద్రరాజు, రెడ్డెయ్యఆచారి, సత్యంనాయుడు, సుబ్బరామరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: వైసీపీ హయాంలో అభివృద్ధి కనుచూపు మేరలో కనిపించడం లేదని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్, జిల్లా కార్యదర్శి వీరబల్లి నరేంద్రగౌడ్ అన్నారు. వీరబల్లిలోని



సుండుపల్లె: మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్

పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను ఈ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందన్నారు. ప్రభుత్వంలో నాయకులు ఇసుక, మట్టి, అమ్ముకుని లక్షలు గడించారు తప్ప , అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మయోజన ద్వారా చేతి వృత్తుల వారికి రుణాలతోపాటు, పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి వెంకట్రామరాజు, ప్రధాన కార్యదర్శి జగన్నాథ, ఉపాధ్యక్షులు ఆంజనేయులురెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుబ్బరాజు, సీనియర్ నాయకులు లక్ష్మీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: 'పల్లెకు పోదాం' కార్యక్రమంతో ప్రతి గడపకు బీజేపీని తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్, అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చంగల్‌రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు.



రైల్వేకోడూరు: పల్లెకుపోదాం కార్యక్రమంలో బీజేపీ నేతలు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెకుపోదాం అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి గడపకు వెళ్లి బీజేపీ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు తోట శ్రీనివాసులు, ఆదినారాయణ, గాదెల శ్రీనివాసులు, జోగినేని సుబ్బారావు, బాపూజీ, టి. సుబ్బరాయుడు, నాగేశ్వర్‌రాజు, వరికూటి మల్లికార్జున, నాగినేని బాలసుబ్రహ్మణ్యం, విశ్వనాథం నాయుడు, శంకర్‌రాజు, కుశల్‌యాదవ్, మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

కడప- బెంగళూరు రైల్వేలైన్ ఏర్పాటుపై ఉద్యమించాలి

రాయచోటిటౌన్, జనవరి29: కడప- బెంగళూరు రైల్వేలైన్‌పై ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటి మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప- బెంగుళూరు రైల్వేలైన్ పాత అలైన్మెంట్ ప్రకారం ఏర్పాటు చేస్తే రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం లో ఒక పరిశ్రమ కూడా లేకపోవడంతో యువత గల్ఫ్ దేశాలకు వెళుతోందన్నారు. చిన్నమండెం, సంబేపల్లె ప్రాంతంలో టమోటా జ్యూస్, ఎర్ర చందనం ఆధారిత పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వెలిగల్లు, ఝరికోన,



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు

శ్రీనివాసపురం రిజర్వాయర్ కాలువలు పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పుల్లయ్య, బత్తల వెంకట్రమణ, రమణ, అనిల్, సురేంద్ర, మహిళా సంఘం నాయకురాళ్లు అరుణ, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల బారినుంచి కాపాడండి

● డీఆర్‌వో సత్యనారాయణకు బాధితుల ఫిర్యాదు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 29: కోర్టు ఆదేశాలను కూడా లెక్క చేయని కబ్జాదారుల నుంచి కాపాడాలని పెద్దమండెం మండలం దిగువపల్లెకు చెందిన కాల్వపల్లె చిన్నప్ప అనే వ్యక్తి సోమవారం డీఆర్‌వో సత్యనారాయణకు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ లిబరేషన్ అన్నమయ్య జిల్లా నేత మావులూరి విశ్వనాథ్ మాట్లాడుతూ పెద్దమండెం మండలం దిగువపల్లె గ్రామ సర్వే నెంబర్ 288/2లో 5.21 ఎకరాల భూమిని దాదాపు 30 ఏళ్ల క్రితం కాల్వపల్లె చిన్నప్ప కొన్నాడన్నారు. ఆ భూమిని వదిలేసి వెళ్లకపోతే చంపుతామంటూ గాలివీడు మండలం దానంరెడ్డిగారిపల్లెకు చెందిన పెనుగొండ జయరాంరెడ్డి, పెనుగొండ ఈశ్వర్‌రెడ్డి మరి కొందరు రెండేళ్లుగా చిన్నప్పను బెదిరిస్తున్నారన్నారు. ఆయన భూమిలో కొబ్బరి చెట్లను పీకేయడంతో బాధితుడు కోర్టుకు వెళ్లగా, ఇంజంక్షన్ ఆర్డర్ జారీ చేసిందన్నారు. అయినా, వారు లెక్క చేయకుండా ఆ భూమిని వదిలేసి వెళ్లకుంటే చంపి పాతేస్తాం అంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి



స్పందన కార్యక్రమంలో డీఆర్‌వోకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు, సీపీఐ ఎంఎల్ నేతలు

చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు రమణ, దళిత బహుజన ప్రజాగళం వ్యవస్థాపకుడు అబ్బవరం నాగేశ్వరరావు, మహిళా నాయకురాలు వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

టీడీపీతోనే., రాష్ట్రంలో అభివృద్ధి

రైల్వేకోడూరు, జనవరి 29: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ నేత నగిరి పాటి రేవతి తెలిపారు. సోమవారం తిరుణంపల్లె, ఓబిలి, అరుంధతివాడ తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో వైసీపీ ఏ మాత్రం అభివృద్ధి పనులు చేయలేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తదితర నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో దళిత, గిరిజన గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టేందుకే గ్రామాల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. పీలేరులో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పిలుస్తోంది రా...కదలిరా కార్యక్రమం విజయవంతంతో వైసీపీలో వణుకు మొదలైందన్నారు. ఆమెతో పాటు దళిత నాయకుడు తేనేపల్లి చిన్నా, రిటైర్డ్ తహసీల్దార్ నగిరిపాటి సుబ్రహ్మణ్యం, నగిరిపాటి మహేష్, మౌనిక పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న నగిరిపాటి రేవతి

మగ్గం వర్క్ మెటీరియల్ పంపిణీ

రైల్వేకోడూరు (రూరల్) జనవరి 29: గిరిజాలేన్‌లోని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ పార్థసారథి ఆధ్వర్యంలో సోమవారం మగ్గంవర్క్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్గంవర్క్‌లో శిక్షణ పొందుతున్న మహిళలకు తన మిత్రుడు సిద్ధార్థ జ్ఞాపకార్థం 30 మందికి ట్రైనింగ్ కిట్స్ పంపిణీ చేశామన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు పాశెంకోట రత్నమ్మ, రైల్వేకోడూరు ఉప సర్పంచ్ తోట శివసాయి, మాస్టర్ ట్రైనర్ పూల తనూజ, ట్రైనర్ పాశెంకోట పద్మావతి, పవిత్ర, భావని తదితర మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, జనవరి 29: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని సోమవారం ముక్కా సాయి వికాస్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం రాత్రి చిన్న ఓరంపాడు పద్మశాలి కాలనీ వాసి బోగా రామసుబ్బయ్య (56) ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి దహన సంస్కారాలకు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నఓరంపాడు సర్పంచ్ గద్దె సిద్దమ్మ, కుమారుడు గద్దె పెంచలయ్య, జింక అశోక్, వెంకటేష్, కావుటూరు గజేంద్ర, వేమన రవీంద్ర, కోటి, ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రతి ఇంటికి కొళాయి

ఓబులవారిపల్లె, జనవరి29 : మండల సమాఖ్య కార్యాలయంలో జలజీవన్ మిషన్ ద్వారా కమ్యూనిటీ కాంట్రాక్టుపై కమిటీ సభ్యులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఎం ఆర్ముగం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హర్‌ఘర్ జల్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కొళాయి మంజూరు చేస్తామని, ఈ కార్యక్రమాన్ని డ్వాక్రా సంఘాల సభ్యులు పర్యవేక్షిస్తారని తెలిపారు. డ్వాక్రా సంఘాల సభ్యులు, సీసీ హరిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అహమ్మద్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రశంస

రామాపురం, జనవరి 29: యువగళం పాదయాత్ర సందర్భంగా చురుగ్గా పని చేసిన రాయచోటి నియోజకవర్గంలోని 20 మంది టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు గుర్తింపుగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి పార్టీ గుర్తు బహుమతిగా అందించారని రామాపురం మండల క్లస్టర్ ఇన్‌చార్జి చింతపిచ్చల రామకృష్ణగౌడ్, రామాపురం మండల తెలుగు యువత అధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి సోమవారం తెలిపారు. పార్టీ సింబల్ అందుకున్న వారిలో రామాపురం మండలానికి సంబంధించి రామకృష్ణగౌడ్, నాగభూషణ్‌రెడ్డి, గణేశ్, చెన్నూరు బాబు, కిరణ్‌నాయుడు ఉన్నారు.



బహుమతి అందుకుంటున్న రామకృష్ణగౌడ్

ప్రకృతి వ్యవసాయ కూరగాయల దుకాణం ప్రారంభం

చిన్నమండెం, జనవరి 29: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల విక్రయ కేంద్రాన్ని మండల కేంద్రంలోని ఉర్దూ స్కూల్ పక్కన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేవనాథ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం తీసుకునే ఆహార పదార్థాలు చాలా వరకు విషపూరితంగా మారందని, దాని వల్ల మానవాళి అనారోగ్యానికి గురవుతున్నారని, అలాంటి వాటికి స్వస్తి పలికేందుకు ప్రకృతి వ్యవసాయంతో పండిన కూరగాయలను ఆహారం గా తీసుకోవాలని సూచించారు. రైతు సాధికార సంస్థ అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఈ మార్కెట్ ప్రతిరోజు నిర్వ హించేలా కార్యాచరణ సిద్ధం చేస్తామని లిపారు. ఈ కార్యక్రమంలో జేఆర్‌పీ పవన్‌కుమార్, ఏపీఎం రెడ్డెమ్మ, సీసీ రెడ్డెన్న, నాగరాజు, చందురెడ్డి, పద్మావతి, శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జులు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.



కూరగాయల విక్రయకేంద్రం ప్రారంభించిన దేవనాథ్‌రెడ్డి

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

చిన్నమండెం, జనవరి29: అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమేశ్‌బాబు హెచ్చరించారు. బోనమల కూడలి వద్ద సోమవారం ఆయన స్థానికులతో మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించినప్పుడే సమాజంలో మార్పు మొదలవుతుందన్నారు. వాహనాలపై అధిక వేగంతో, నిర్లక్ష్యంగా వెళ్లడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయన్నారు.

ఈకేవైసీతో ముప్పుతిప్పలు

సిద్దవటం, జనవరి 29: గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు తమ వివరాలను మళ్లీ నిర్ధారించుకోవాలని పెద్ద ఎత్తున ప్రచారం జరగంతో ప్రజలు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. మండలం లోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని షిరిడి సాయి ఇండేన్ గ్యాస్ ఏజన్సీ వద్ద సోమవారం ఉదయం 8 గంటల నుంచి క్యూలో బారులు తీరారు. చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు ఒక్కసారిగా అక్కడికి చేరుకోవడంతో గందరగోళం నెలకొంది. ఎండ నుంచి రక్షణతోపాటు, తాగునీరు అందుబాటులో లేకపోవడంతో కొందరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో క్యూలో నిలుచోవడం చేతకాక కొంత మంది వెనుతిరిగి వెళ్లిపోయారు. ఇంత జరుగు తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని, వెంటనే ఏజన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏజెన్సీ నిర్వాహకుడు హరికృష్ణ మాట్లాడుతూ ఈకేవైసీ నమోదు ప్రారంభించి నెల రోజులైందని, ఆరు నెలలకు వచ్చినా కూడా చేయిస్తామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు చేయిస్తున్నామని, మంగళవారం నుంచి గ్యాస్ గోడౌన్ వద్ద రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి, అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు.



ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద బారులు తీరిన మహిళలు

అన్న వితరణతో ఆత్మసంతృప్తి

నందలూరు, జనవరి 29 : అన్నదానంతో ఆత్మసంతృప్తి కలుగుతుందని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సమీపంలోని శ్రీరామ్ ప్రజా వైద్యశాల ఎదురుగా నిర్వహిస్తున్న అన్నవితరణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు మేడా వెంకటకుమార్, బీజేపీ నాయకులు మండెం నాగేంద్ర, లోకేష్ రాజు, బజ్జీల అంకయ్య, ఫ్రూట్స్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని ప్రజలు ఇంటికి పంపడం ఖాయం: చల్లా

పుంగనూరు, జనవరి 29: కుప్పంలో చంద్రబాబు ఓడిపోతారని ఆరోపించడం హాస్యాస్పదమని, ముందు పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలను పుంగనూరులో ఓడించి శాశ్వతంగా ఇంటికి పంపాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దేశవిదేశాల్లో పేరు ప్రఖ్యాతలు పొందిన మాజీ సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి, అర్హత మంత్రి పెద్దిరెడ్డికి లేదన్నారు. చంద్రబాబుపై మంత్రి పెద్దిరెడ్డి ఇష్టమెచ్చినట్లు ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారని, రాళ్లదెబ్బలు తప్పవని మాట్లాడటం దారుణమని ఖండించారు. గత 20 ఏళ్లుగా పెద్దిరెడ్డి కుటుంబం దౌర్జన్యాలు, అరాచకాలు, దాడులు, దోపిడీలలకు పాల్పడుతూ శిఖండి రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబుకు ఇంగ్లీషు మాట్లాడటం రాదని చెప్పడం దారుణమని, ఆయన అంతర్జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు పొందారనే విషయాన్ని గమనించాలని హితవుపలికారు. వైసీపీ ప్రభుత్వానికి ఇక రెండునెలలే గడువని తర్వాత పెద్దిరెడ్డి అరాచకానికి అంతం పలుకుతారన్నారు.

పలమనేరు ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

ప్రమాద స్థితి నుంచి మహిళను కాపాడిన డాక్టర్ శ్యామలాదేవి

పలమనేరు, జనవరి29 : విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతూ సోమవారం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన సుమతి అనే వివాహిత కడుపులో ఉన్న భారీ కణితిని గుర్తించి వెంటనే ఆపరేషన్‌చేసి ఆ మహిళను కాపాడారు. సోమవారం బంగారుపాళ్యంకు చెందిన మోహన్ భార్య సుమతి(32) కడుపునొప్పితో బాధపడుతూ పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుంది. వెంటనే వైద్యులు పరీక్షలు చేసి మహిళ కడుపులో భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ చేసి ఈ కణితిని వెలికి తీయాలని డాక్టర్లు సుమతికి తెలియజేశారు. వెంటనే డాక్టర్ శ్యామలాదేవి సుమతిని ఆపరేషన్ థియేటర్‌కు తరలించి ఆమె కడుపులో ఉన్న కణితిని ఆపరేషన్ ద్వారా వెలికి తీశారు. 25-17 సెంటీమీటర్ల పొడవు, వెడల్పుతో ఉన్న కణితిని తొలగించారు. దీంతో సుమతి ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకొంది.

పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 29: గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టామని డీపీవో లక్ష్మి సోమవారం తెలిపారు. ఇంటి పన్ను, ఇతర పన్నులను నగదురహిత లావాదేవీల రూపంలో వసూలు చేసేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో 697 గ్రామ పంచాయతీల్లో క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు.

జేఈఈ మెయిన్స్‌కు 252 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 29: చిత్తూరులోని సీటమ్స్‌లో సోమవారం జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 256 మంది విద్యార్థులకు గాను 252 మంది హాజరు కాగా, నలుగురు గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం జరిగిన ఫస్టు షిఫ్టులో 128 మందికి గాను 127 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్టులో 128 మందికి గాను 125 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో తప్పులు దొర్లితే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 29: ఎన్నికల జాబితాలో మార్పులు- చేర్పులకు సంబంధించి ఎక్కడైనా తప్పులు దొర్లితే చర్యలు తీవ్రంగా ఉంటాయని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 24 గంటల్లోగా ఓటర్ల జాబితా అంశంలో వచ్చిన ప్రతి క్లెయిమ్‌ను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆన్‌లైన్ ద్వారా నివేదిక అందించాలన్నారు. లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత రెవిన్యూ అధికారులపై ఉందన్నారు. పత్రికల్లో వస్తున్న వార్తలపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మృతిచెందిన, జంక్, డూప్లికేట్ ఓటర్ల జాబితాలపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

52వేల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు రంగం సిద్ధం

52వేల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు రంగం సిద్ధం చేశామని జేసీ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అమరావతి నుంచి సీసీఎల్‌ఏ కార్యదర్శులు సాయిప్రసాద్, ఇంతియాజ్ అన్ని జిల్లాల జేసీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాలిచ్చిన లబ్ధిదారులందరికీ సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.


'పాచిగుంట'కు కన్నీటి వీడ్కోలు



మనోహర్‌నాయుడు భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న అమర్, నాని తదితరులు

గంగాధరనెల్లూరు, జనవరి 29: తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్‌నాయుడికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం సాయంత్రం వేలూరు సీఎంసీలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి నుంచి ఆయన సొంతూరు పాచిగుంటకు వివిధ పార్టీల నేతలు, బంధుమిత్రులు, స్థానికులు తరలివచ్చి నివాళులు అర్పించారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పారు. గంగాధరనెల్లూరు, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జిలు డాక్టర్ థామస్, మురళిమోహన్, మరోవైపు రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, మండల నేతలు జ్యోతీశ్వరరెడ్డి, మనోహర్‌నాయుడు తదితరులు పాడె మోశారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పులివర్తినాని, మాజీ మేయర్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎ.ఎస్.మనోహర్, నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల క్రిష్ణమనాయుడు, వైసీపీకి చెందిన ఎన్ఆర్ఐ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాంధీ, డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, జనసేనకు చెందిన నియోజకవర్గ జనసేన కన్వీనర్ పొన్నా యుగంధర్, బీజేపీకి చెందిన మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుత్తా ప్రభాకర్‌నాయుడు, జిల్లా బీజేపీ కోశాధికారి హరినాథ్ నాయుడు తదితరులు నివాళులర్పించారు.

తమిళనాడు మాజీ సీఎంకు ఘనస్వాగతం



నగరి, జనవరి 29: తమిళనాడు మాజీ సీఎం పళని స్వామికి నగరిలో ఏఐఏడీఎంకే నాయకులు డాక్టర్ అంబ్రూస్ విల్సన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం తిరుమల వెళుతున్న ఆయన్ను.. ఓంశక్తి ఆలయం వద్ద ఏఐడీఎంకే పతాకాలను, తోరణాలను ఏర్పాటు చేసి శాలువాతో సన్మానించారు. అనంతరం కనుమమిట్ట వద్ద సేలంకు చెందిన క్రషర్ కూలీలు తమ యజమాని కుప్పయ్యశెట్టి ఆధ్వర్యంలో పళనిస్వామికి స్వాగతం పలికారు.

వి.కోట వైసీపీలో ప్రొటోకాల్ వివాదం

వి.కోట, జనవరి 29: వి.కోటలో ఆదివారం జరిగిన ఆసరా సభలో అధికార పార్టీలో ప్రొటోకాల్ వివాదం తెరపైకి వచ్చింది. సభావేదిక వెనుక ఏర్పాటు చేసిన పోస్టర్‌లో తన ఫొటో ఎందుకు వేయలేదో చెప్పాలంటూ ఎంపీపీ యువరాజ్‌ను మండల వైసీపీ కన్వీనర్, రాష్ట్ర రోడ్లు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ బాలగురునాథ్ ప్రశ్నించారు. ఇది తాను ఏర్పాటు చేసిన బ్యానర్ కాదని ఎంపీపీ చెప్పగా.. ప్రొటోకాల్ ఎవరిచ్చారంటూ ఎంపీడీవోను అడిగారు. స్థానిక సర్పంచి ఫొటో సైతం ప్రచురించలేదంటూ మరో వర్గం గొడవకు దిగింది. ఇంతలో పార్టీ నేతలు కలగజేసుకుని.. కార్యక్రమం అయ్యాక మాట్లాడుదామంటూ సర్దుబాటు చేశారు. స్థానికుడైన జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఈ సమావేశానికి రాకపోవడం అధికార పార్టీలో చర్చనీయాంశంగా పరిణమించింది. ఈ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తారని ప్రచారం చేసినా.. ఆయన రాకనే సభ ముగించారు. సభ ముగిసిన అరగంటకే మంత్రి వి.కోటలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరుకావడం అధికార పార్టీలో చర్చగా మారింది. వి.కోట వైసీపీలో తారస్థాయికి చేరిన వర్గ విభేదాలు వచ్చే ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.






కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్ల సంఘ నేతలు - దీక్షా శిబిరంలో నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు - అర్జీని పరిశీలిస్తున్న డీఆర్వో రాజశేఖర్

పెన్షనర్ల గోడు పట్టించుకోండి

కలెక్టరేట్ వద్ద నిరసన

'స్పందన'లో 277 అర్జీల స్వీకరణ

చిత్తూరు, జనవరి 29: తమ గోడు పట్టించుకోవాలంటూ పెన్షనర్ల సంఘం నేతలు డిమాండు చేశారు. సోమవారం స్పందన కార్యక్రమం సందర్భంగా వీరు కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. అడిషనల్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్, 11వ పీఆర్‌సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఆరోగ్య కార్డు ద్వారా గుర్తింపు పొందిన ఆస్పత్రులలో వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధిని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నేతలు శివకుమార్, ప్రభాకర్ నాయుడు, మురుగానందం, కోదండ, నారాయణస్వామి, కృష్ణమనాయుడు, రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే నుంచి మినహాయించండి

ఏఎన్ఎం-3లకు కులగణన సర్వే విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రజారోగ్య, వైద్యశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండు చేశారు. సర్వే కారణంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ఏఎన్ఎంలు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని వాపోయారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు వైద్య సిబ్బందికి మినహాయింపు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోగేశ్వరపిళ్లై, శ్రీనివాసమూర్తి, శివయ్య పాల్గొన్నారు.

ఆర్టీఐ దరఖాస్తుకు సమాచారమేదీ?

సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరగా నగరి ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసులు సమాచారం ఇవ్వకపోగా దుర్భాషలాడారని బీసీ విద్యార్థి విభాగం రాయలసీమ అధ్యక్షుడు వాసుకుమార్ ఆరోపించారు. నగరి పరిధిలోని ఎస్సీ హాస్టళ్లలో సక్రమంగా విద్యార్థులకు భోజనాలు పెట్టడం లేదని తెలిసిందని, ఇదే విషయమై కొన్ని వివరాలను అడిగానని తెలిపారు. దరఖాస్తును తీసుకోకపోగా ఆయన గది నుంచి బయటకు వెళ్లమని బెదిరించారని తెలిపారు. అదే రోజు ఆ శాఖ డీడీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. నగరి ఏఎస్‌డబ్ల్యూపై ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

టైం స్కేల్ వర్తింప చేయండి

డీఆర్‌డీఏ పరిధిలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింప చేయాలంటూ ఆ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండు చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరవధిక సమ్మెలో పాల్గొన్న వీరు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయకుండా సీఎం మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సీలింగ్ విధానానికి బదులుగా వందశాతం బేసిక్ పే, ఈపీఎఫ్, హెచ్ఆర్ పాలసీ, పదోన్నతులు, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు ఉమాపతి, మోహనకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలే అధికం

కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలలో రెవెన్యూ శాఖవే ఎక్కువగా ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి 277 మంది హాజరై అర్జీలిచ్చినట్లు డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. ఇందులో రెవెన్యూశాఖకు 243, డీఆర్‌డీఏకు 9, మున్సిపాలిటీలకు 5, విద్యాశాఖకు 4, జిల్లా పరిషత్‌కు 3 వంతున.. మిగిలిన శాఖలకు 13 అర్జీలు అందాయి. బాధితుల సమస్యలను విన్న డీఆర్వో.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పోలీసు స్పందనకు 25 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 25 అర్జీలు అందినట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. వేధింపుల కింద 6, భూ తగాదాలు 4, ఆస్తితగాదాలు 4, ఇంటి తగాదాలు 3, కుటుంబ తగాదాలు 3, దారి తగాదాలు 3, వేధింపులు 1, చీటింగ్ కింద ఒకటి వంతున ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సుధాకర్, సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

గాంధీపురంలో వైసీపీ ఎంపీటీసీ భూ కబ్జా

తహసీల్దారుకు ప్రజల ఫిర్యాదు

పుంగనూరు, జనవరి 29: పుంగనూరు సమీపం గాంధీపురంలో గ్రామకంఠం భూమిని వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఆక్రమించారని ప్రజలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం పుంగనూరు మండలం మోదుగులపల్లె పంచాయతీ భీమగానిపల్లె రెవెన్యూ గ్రామం గాంధీపురంలో సర్వేనంబర్ 265/5లో దాదాపు 1-30 ఎకరాల భూమి గ్రామ కంఠంగా రికార్డుల్లో ఉంది. మూడు రోజులుగా ఎంపీటీసీ సభ్యుడు సురేంద్ర ఆ స్థలాన్ని ఆక్రమించి చదును చేశాడు. గ్రామం నుంచి పొలాలకు వెళ్లడానికి రోడ్డును కూడా చదును చేశారని, గంగమ్మ గుడి దారిలేకుండా, గ్రామానికి తాగునీటి కోసం వేసిన బోరు వద్దకు వెళ్లే మార్గంలేకుండా ఆక్రమించుకుని ప్రహరీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలం ఎందుకు ఆక్రమించారని తాము అడిగినందుకు మాపై పోలీసు కేసులు బనాయించి బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో తెలిపారు.గ్రామస్థుల ఫిర్యాదుపై తహసీల్దార్ సీతారాం మాట్లాడుతూ ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పగా గ్రామస్తులు ప్రభుత్వ స్థలం కబ్జాపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్‌రాజ్, ఆనందాచారి, మోహన్, శ్రీనివాసులు, రమేశ్, హరీష్, శ్రీదేవి, శారద తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ సభ్యుడు కబ్జా చేసిన స్థలం



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

వైసీపీ నేత దుకాణంలో కర్ణాటక మద్యం సీజ్

అధికారులపై విరుచుపడ్డ వైనం ● కేసు నమోదు చేసిన పోలీసులు



కడపల్లెలోని షాపు వద్ద అధికారులు, వైసీపీ నేతలు

శాంతిపురం, జనవరి 29: శాంతిపురం మండలం కడపల్లెకు చెందిన వైసీపీ నేత దుకాణంలో కర్ణాటక మద్యంను చిత్తూరు ఎక్సైజ్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. కుప్పం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కర్ణాటక మద్యంతో బెల్టు షాపులు జోరుగా సాగుతున్నాయని సమాచారంపై వీరు దాడులు నిర్వహించారు. శాంతిపురం మండలం కడపల్లెలోని వైసీపీ నేత కుప్పం-పలమనేరు జాతీయ రహదారి పక్కనున్న దుకాణంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నటు గుర్తించారు. ఆ షాపులో తనిఖీ చేసి 70 బాటిల్ టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం సీజ్ చేశారు. ఈ విషయం తెలిసి మండల వైసీపీ ముఖ్య నేతలు అక్కడికి చేరుకున్నారు. సీజ్ చేసిన మద్యాన్ని వదిలేయాలంటూ వారిపై దురుసుగా ప్రవర్తించారు. ఈ క్రమంలో కొంతసేపు వాగ్వాదం జరిగింది. వీరు వినకపోవడంతో కుప్పం నియోజకవర్గ ముఖ్య నేతల ద్వారా జిల్లా అధికారులకు ఫోను చేయించినట్లు తెలిసింది. చివరకు జిల్లా అధికారుల ఒత్తిడి మేరకు సీజ్ చేసిన మద్యం బాటిల్లో కొంత అక్కడే వదిలేసి నామమాత్రంగా కొన్ని బాటిళ్లను సీజ్ చేసినట్లు సమాచారం. దీనిపై కుప్పం ఎక్సైజ్ పోలీసులను వివరణ కోరగా.. చిత్తూరు ఎక్సైజ్ స్పెషల్ స్క్వాడ్ వారు దాడులు నిర్వహించి కడపల్లెలో 20 బాటిళ్లు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

1న జడ్పీ స్థాయిసంఘ సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 29: జిల్లాపరిషత్‌కు సంబంధించి ఐదు స్థాయి సంఘ సమావేశాలు ఫిబ్రవరి ఒకటో తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. జడ్పీ నూతన సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు రెండవ (గ్రామీణాభివృద్ధి), 4వ (విద్య, వైద్యం), మధ్యాహ్నం 3.30 గంటలకు మూడవ (వ్యవసాయం), ఐదవ (మహిళా సంక్షేమం), 6వ (సాంఘిక సంక్షేమం) స్థాయి సంఘ సమావేశాలు.. ఆయా చైర్మన్ల అధ్యక్షతన జరుగుతాయని వివరించారు. ఈ సమావేశాలకు కిందిస్థాయి అధికారులను పంపకుండా పూర్తి వివరాలతో జిల్లా అధికారులే హాజరు కావాలని ఆయన కోరారు.

ఆపరేషన్ వికటించిందంటూ రాస్తారోకో



పసికందుతో రోడ్డుపై బైఠాయించిన బాధితులు

నగరి, జనవరి 29: నగరి ఏరియా వైద్యశాలలో చేసిన సిజేరియన్ ఆపరేషన్ వికటించిందంటూ గుండ్రాజకుప్పం దళితవాడవాసులు సోమవారం రోడ్డెక్కారు. దీనిపై బాధితుడు ప్రతాప్ మాట్లాడుతూ.. 'గుండ్రాజకుప్పం దళితవాడకు చెందిన నా భార్య వన్మతిని డెలివరీ కోసం జనవరి 5న ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చాం. తొలుత డ్యూటీలో ఉన్న డాక్టర్లు సాధారణ డెలివరీ అవుతుందని చెప్పారు. ఆ తర్వాత డ్యూటీకి వచ్చిన డాక్టర్ సిజేరియన్ చేయాలన్నారు. ఆపరేషన్ చేసి ఆడబిడ్డను బయటకు తీశారు. ఆపరేషన్ తర్వాత మల, మూత్రాలు రెండూ మూత్రం వచ్చే చోట నుంచి రావడం ప్రారంభమైంది. సిజేరియన్ వల్ల ఇలా వస్తుందేమోనని డాక్టర్‌కు చెప్పాం. పరీక్షలు చేసి, ఎక్స్‌రేలు తీసి సమస్యను మా దృష్టికి తేలేదు. 108 వాహనం ద్వారా ఓ డాక్టర్‌ను పంపి రుయా వైద్యశాలకు పంపారు. అక్కడి వైద్యుల మాటలు విని సందేహం వచ్చి ప్రైవేటుగా స్కాన్ తీయిస్తే సమస్య తెలిసింది. వెంటనే తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి ఆపరేషన్ చేయించాం. మూడునెలల తర్వాత మరో ఆపరేషన్ చేయాలని అక్కడి డాక్టర్లు చెప్పారు' అని వివరించారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వీరు నగరి ఏరియా వైద్యశాలకు చేరుకుని సూపరింటెండెంట్ ప్రభావతి, వైద్యులకు సమాచారం చెప్పారు. జిల్లా అధికారుల దృష్టికి తాము సమస్యను తీసుకెళతామని సూపరింటెండెంట్ తెలిపారు. ఇప్పటికే జిల్లా అధికారులు విచారించి వెళ్లారని, వారి నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలన్నారు అలాకాదు.. వెంటనే డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండు చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. నిరుపేదలైన తాము ఆపరేషన్లను లక్షలాది రూపాయలు వెచ్చించలేమని ఆవేదన చెందారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. వీరి రాస్తారోకోతో వాహనాలు ఆగాయి. సీఐ సురేష్ తన సిబ్బందితో వెళ్లి బాధితులను పక్కకు తప్పించి రాకపోకలను క్లియర్ చేశారు. బాధితులు తిరిగి వైద్యశాలకు వెళ్లే రోడ్డుపై బైఠాయించారు. తాను న్యాయం జరిగేలా చూస్తానని సీఐ హామీ ఇవ్వడంతో బాధితులు ధర్నా విరమించారు.

ముగిసిన పోలీసుల ఆటల పోటీలు



టగ్‌వార్ పోటీల్లో కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు, జనవరి 29: చిత్తూరులోని జిల్లా పోలీసు మైదానంలో మూడు రోజులుగా జరిగిన పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు సోమవారం ముగిశాయి. చివరి రోజున వంద మీటర్ల పరుగు పందెం ఫైనల్ పోటీని కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి జెండా ప్రారంభించారు. అనంతరం మూడు సబ్ డివిజన్ల నుంచి ఆటల పోటీలకు హాజరైన డీపీవో టీమ్, ఆర్మ్‌డ్ రిజర్వుడు పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వీరికి 800 మీటర్లు, 400 మీటర్లు, 200, 100 మీటర్ల పరుగుపందెంతో పాటు లాంగ్ జంప్, షాట్‌పుట్, 400 మీటర్ల రిలే, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో గెలుపొందిన వారికి ఎస్పీ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్ రెడ్డి, రవి కుమార్, బాబు ప్రసాద్, విష్ణు రఘువీర్, శ్రావన్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ మురళీ, ట్రైనీ డీఎస్పీ పావనకుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి ఎంపీ సీటుకు కొత్త అభ్యర్థిని ప్రకటిస్తాం / మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చెప్పారు. అనంతపురంలో వచ్చే నెల మొదటివారంలో జరగనున్న వైసీపీ 'సిద్ధం' సభ ఏర్పాట్లపై చర్చించేందుకు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం సమావేశం జరిగింది.జన సమీకరణ ఏర్పాట్లపై వైసీపీ ఎమ్మెల్యేలతో, నాయకులతో మంత్రి చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను అవినీతిపరుడో కాదో ప్రజలకు తెలుసునని, ఆదిమూలంపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తిరుపతి ఎంపీగా ఆదిమూలం స్థానంలో కొత్త అభ్యర్థిని పార్టీ ప్రకటిస్తుందన్నారు.టికెట్లు రానివారిని ఇతర పదవులతో సంతృప్తిపరిచేందుకు పార్టీ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రాయలసీమ జిల్లాల్లో అన్ని సీట్లనూ వైసీపీ గెలుచుకుంటుందన్నారు. 'నగరి నియోజకవర్గంలో పనిచేసుకుంటున్న నేను ఒంగోలుకు పోవాల్సిన అవసరం ఏముందో అర్థం కావడంలేదు. ఒకవేళ పార్టీ ఆదేశిస్తే ఒంగోలు ఎంపీగా పోటీ చేసేందుకు కూడా సిద్ధమే' అని మంత్రి రోజా అన్నారు. తాను నామినేటెడ్ పదవులు అమ్ముకుంటున్నానని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పుణ్యంతో కౌన్సిలర్ అయిన మహిళ ఎవరో చెప్పిన మాటలకు లొంగి తనపై బురద జల్లారని, అలాంటివాళ్లకు భగవంతుడే సమాధానం చెబుతాడన్నారు. మంత్రి పెద్దిరెడ్డిపై ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన వ్యాఖ్యలు కరెక్టు కాదన్నారు. రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయని చెప్పడానికి ఆదిమూలం వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి జయరాం,ఎంపీ గోరంట్ల మాధవ్, పూతలపట్టు, సత్యవేడు, మదనపల్లె ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం, నవాజ్ బాషా, తిప్పేస్వామితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, నేతలు హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాలతో కొందరు రాలేకపోయారని పెద్దిరెడ్డి చెప్పుకొచ్చారు. తిరుపతిలో సమావేశం జరిగినప్పటికీ స్థానిక నేతలు కన్పించకపోవడాన్ని పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఎంపీ గురుమూర్తి మినహా తక్కినవారు సమావేశంలో కనిపించలేదు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నిమ్మనపల్లి, జనవరి 29: ఇసుక అక్రమంగా రవాణా చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శనివారం మండలంలోని తవళం రెవెన్యూ గ్రామంలో సురేంద్రరెడ్డికి చెందిన వ్యవవసాయ భూమి వద్ద రాత్రి సమయంలో చౌకిళ్లవారిపల్లికి చెందిన జగదీష్ రెడ్డి తన ఎక్స్‌కవేటర్,ట్రాక్టర్ల సహాయంతో ఇసుకను రవాణా చేస్తుండడంతో యజమాని సురేంద్రరెడ్డి, గ్రామస్థులు పట్టుకొని ఒక ట్రాక్టర్‌ను పోలీసులకు అప్పగించగా మిగిలిన వాహనాలు పారిపోయిన విషయం విదితమే. దీంతో స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎక్స్‌కవేటర్‌తో పగిలిన పైపులను పరిశీలించారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్ తపశ్వనికి జగదీష్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న ఇసుక డంప్‌పై ఫిర్యాదు చేయడంతో ఆ డంప్‌ను సీజ్ చేస్తామని తెలిపారు. అనంతరం సురేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు జగదీష్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

భూమిలోకి వెళ్తే దౌర్జన్యం చేస్తున్నారు

తాలూకా ఎస్ఐకి బాధితుల ఫిర్యాదు

మదనపల్లె, జనవరి 29: మదనపల్లె మండలం వేంపల్లె సమీపంలోని తమ పొలానికి వెళ్తే అదే గ్రామానికి చెందిన వ్యక్తులు తమపై దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు తాలూకా ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లెకు చెందిన డి.శంకర్, కురబలకోట మండలం నల్లగుట్టపల్లెలో కాపురం ఉంటున్న కె.యల్లమ్మలు పోలీసులను ఆశ్రయించారు. వేంపల్లె సర్వేనంబర్:981లో 2.95ఎకరాలు భూమికి సంబంధించిన రికార్డులన్నీ తమ వద్ద ఉన్నాయని, ఇతరులు ఆక్రమించుకుని తమను పొలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కుటుంబ జీవనాధారం కోసం పట్టణానికి చెందిన ఎం.శాంతమ్మకు విక్రయించి, అగ్రిమెంటు రాసుకున్నామని, ఇందులోభాగంగా హద్దులు చూపించడానికి పొలానికి వెళ్లగా భూమిలోకి రావద్దని వేంపల్లె, జవుకుపల్లెకు చెందిన రెడ్డెప్ప, పెద్దరెడ్డెప్ప, అశోక్, నరసింహులు, గుర్రప్ప, రామన్నలు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. భూమిలోకి ప్రవేశిస్తే చంపుతాం, నరుకుతామంటూ బెదిరిస్తున్నారని బాధితులు పి.శంకర్, కె.యల్లమ్మలు పేర్కొన్నారు. రికార్డుల ఆధారంగా విచారణ చేపట్టి, తమకు న్యాయం చేయడంతోపాటు వారి నుంచి రక్షణ కల్పించాలని బాధితులు తాలూకా ఎస్ఐను కోరారు.


నాటు తుపాకీ దెబ్బకు మహిళకు గాయాలు

మదనపల్లెటౌన్, జనవరి 29: వేటగాళ్ల నాటు తుపాకీ దెబ్బకు పాపులమ్మ(45) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. మదనపల్లె మండలం ఆవులపల్లి గ్రామానికి చెందిన సిద్ధప్ప భార్య పాపులమ్మ అడవి శివారు ప్రాంతంలోని పొలం పనులకు వెళ్లింది. ఈ క్రమంలో ఓ వేటగాడు జంతువులను వేటాడేందుకు నాటు తుపాకీ కాల్చాడు. దీంతో ఆ నాటు తుపాకీ రవ్వలు పొలంలో ఉన్న పాపులమ్మకు తగిలి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులు మదనపల్లె పోలీసులకు సమాచారం అందించారు.

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

రామసముద్రం, జనవరి 29: కర్ణాటక రాష్ట్రానికి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మదనపల్లె ఈశ్వరమ్మ కాలనీకి చెందిన హబీబుల్లా ఆదివారం రాత్రి తన సుమో వాహనంలో 1450కేజీల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ రామసముద్రం మండలంలోని చెంబకూరు సమీపంలో ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్ట్ ఆల్ప్రిపల్లె వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. రేషన్ బియ్యంతో పాటు సుమోను స్వాధీనం చేసుకుని హబీబుల్లాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో తంబళ్లపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మృతి


పురుషోత్తం ఆచారి (ఫైల్‌ఫొటో)


తంబళ్లపల్లె, జనవరి 29: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం యు.పురుషోత్తం ఆచారి(59) గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఉదయం మదనపల్లెలో స్వగృహంలో ఉండగా గుండెపోటు రావడంతో చికిత్స కోసం కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించ డంతో ఆసుపత్రిలోనే కన్నుమూశాడు. ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ఉపాధ్యాయులు హెచ్ఎం యు.పురుషోత్తంఆచారి మృతదేహాన్ని సందర్శించి నివాళుర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

నేడు నిమ్మనపల్లెలో చేపల చెరువుల వేలం

నిమ్మనపల్లి, జనవరి 29: మండలంలోని సామకోటవారిపల్లి పంచాయతి, తవళం పంచాయతిలో గల చేపల చెరువులను మంగళవారం వేలం వేయనున్నట్లు కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సామకోటవారిపల్లి పంచాయతిలో గల 3చెరువులకు ఉదయం 10గంటలకు, తవళం పంచాయతిలో గల 5చెరువులకు మధ్యాహ్నం 2గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. అలాగే పాటదారులు డిపాజిట్ పరంగా రూ.5వేలు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. కాగా పాటదారులు పంచాయతికి ఎటువంటి బకాయిలు ఉండరాదని తెలిపారు.

కలగా మిగిలిన ఆర్టీసీ డిపో

● పదిహేడేళ్లుగా అదిగో.. ఇదిగో.. అంటూ బి.కొత్తకోటవాసులను ఊరిస్తున్న పాలకులు ●ఎన్నికల హామీ ఎప్పటికి నెరవేరేను


దాతలు ఇచ్చిన స్థలంలో నిర్మించిన బస్సు షెల్టర్


ప్రస్తుతం డిపో ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలం


ఇటీవల ఆర్టీసీ డిపో ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి(ఫైల్)

బి.కొత్తకోట జనవరి 29 : అదిగో ఆర్టీసీ డిపో... ఇదిగో వచ్చే నెలలో ప్రారంభించేస్తాం. బస్సులొచ్చేస్తాయ్.. మాపార్టీ హామీ నెలబెట్టుకుంటుంది. అంటూ ఒకటి కాదు రెండు కాదు పదిహేడేండ్లుగా బి.కొత్తకోట వాసులను రాజకీయ పార్టీలు ఊరిస్తూనే ఉన్నాయి. ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా కలగానే మిగులుతోంది తప్ప, అమలుకు నోచుకోవడం లేదు. ఆర్టీసీ డిపో ఏర్పాటు జరిగింది లేదు. బి.కొత్తకోట పట్టణ, మండల ప్రజలే కాకుండా పొరుగు మండలాలైన పీటీఎం, ములకలచెరువు, కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజలు సైతం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తూనే ఉన్నా వారి ఆశలు ఫలించడంలేదు.

2006లో ఆర్టీసీ డిపో రద్దు

బి.కొత్తకోట ఆర్టీసీ డిపోను నష్టాల సాకుతో 2006 డిసెంబర్ 31 న రద్దు చేశారు. మరుసటి రోజే ఆర్టీసీ గ్యారేజ్‌లో ఉన్న సామగ్రిని తరలించేశారు. దీనిని నిరసిస్తూ అప్పట్లో అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాలు దీక్షలు, ధర్నాలతో పాటు పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పుంగనూరుతో సహా 14 డిపోలను రద్దు చేశారు. ఆపై ఒక్కొక్కటిగా బి.కొత్తకోట మినహా అన్ని పునః ప్రారంభమయ్యాయి. అధికారులు, పాలకులు హడావుడి చేయడం తప్ప ఆర్టీసీ డిపో ప్రారంభానికి నోచుకోలేదు.

ఎంపిక చేసిన స్థలాలు ఎన్నో..

బి.కొత్తకోట ఆర్టీసీ డిపో ప్రారంభం అవగానే శాశ్వత ప్రాతిపదికన ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజ్ నిర్మాణం కోసం మదనపల్లె రోడ్డులో ఓ దాత రెండు ఎకరాల స్థలాన్ని సంస్థకు విరాళంగా రాతపూర్వకంగా ఇచ్చాడు. అయితే ఈ స్థలంలో తాత్కాలిక బస్సు షెల్టర్, సరిహద్దులను దిమ్మెలను మాత్రమే నిర్మించి ఊరుకున్నారు. ఇచ్చిన స్థలాన్ని ఏళ్ల తరబడి సద్వినియోగం చేసుకోక పోవడంతో ఆ దాత ఆ విరాళాన్ని రద్దు పరుచుకున్నాడు. పీటీఎం రోడ్డులోని దేవాదాయ శాఖ స్థలాన్ని డిపో నిర్మాణం కోసం ఎంపిక చేశారు. అయినా అది కూడా కార్యరూపం దాల్చలేదు. లాభాపేక్షతో కాకుండా సేవా దృక్పథంతో ప్రయత్నాలు చేసిఉంటే డిపో ప్రారంభం అయిఉండేది.

డిపో మూతతో సమస్యలెన్నో..?

బి.కొత్తకోట ఆర్టీసీ డిపో రద్దు చేయడంతో బి.కొత్తకోట పట్టణానికి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పీటీఎం, ములకలచెరువు మండలాలు, సరిహద్దున ఉన్న దాదాపు 30 కర్ణాటక గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేకుండా పోయింది. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల హామీ నెరవేరేనా..!

ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో బి.కొత్తకోటలో ఆర్టీసీ డిపోను మళ్లీ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదు. గతంలో సాయిప్రతాప్ ఎంపీగా ఉన్న సమయంలో ఎన్నికల ముందు డిపో ప్రారంభించేశామంటూ, బి.కొత్తకోటలో సభ పెట్టి హడావిడి చేశారు. కొన్ని బస్సులకు సైతం బి.కొత్తకోట డిపో లోగోను వేసి తిప్పారు. అయితే అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ప్రస్తుత ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి సైతం ఆర్టీసీ అధికారులతో ఇటీవల డిపో ఏర్పాటుపై చర్చలు జరపడం ఆర్టీసీ అధికారులు దేవాదాయ శాఖ స్థలాన్ని పరిశీలించడం జరిగింది. త్వరలో ఆ స్థలం కేంద్రంగా డిపో పునః ప్రారంభం చేయనున్నట్లు ప్రచారం జరిగింది. ఇది జరిగి రెండు నెలలైనా కార్యరూపం దాల్చింది లేదు. ఈ సారైనా ఎన్నికల హామీ నెరవేరేనా అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

దేవదాయ శాఖ కమిషనర్ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది

బి.కొత్తకోటలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు దేవాదాయ శాఖ స్థలాన్ని పరిశీలించాం. ఆస్థలం ఖాళీగా లేదు. ఇటుక బట్టీలతో నిండి ఉంది. ఖాళీ చేయించి ఇస్తామన్నారు. రూ. 1.80 లక్షలు అద్దె చెల్లిస్తామని, మూడేళ్లకు ఒకసారి 10 శాతం పెంచుతామని చెబుతున్నాం. అయితే 30 శాతం పెంచాలని దేవదాయ శాఖ అధికారులు అడుగుతున్నారు. ప్రస్తుతం ఫైల్ దేవదాయ శాఖ కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉంది. వారి నిర్ణయం ప్రకటిస్తే సంబంధిత స్థలంలో పనులు ప్రారంభిస్తాం.

- రాము, రీజనల్ మేనేజర్ రాయచోటి

మదనపల్లెలో ఉమ్మడి అభ్యర్థి గెలుపు ఖాయం

●జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, జనవరి 29: మదనపల్లెలో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపు ఇప్పటికే ఖాయమైందని, ఇక ఎన్నికలే జరగాల్సివుందని ఆపార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. జనంకోసం జనసేన కార్యక్రమంలో భాగంగా సోమవారం 49వరోజు బెంగళూరుబస్టాండు, పెద్దమసీదురోడ్డు, అప్పారావువీధి, త్యాగరాజవీధులలో పర్యటించారు. ఈసందర్భంగా శ్రీరామ రామాంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికే జగన్ పని అయిపోయిందని, ఇక 74రోజులే గుడువు ఉందన్నారు. జగన్ కూడా తానే దిగిపోతారని స్వరం మారడం చూస్తే ఓటమి భయం పట్టుకుందన్నారు. జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, ప్రజలంతా ముక్తకంఠంతో చెబుతున్నట్లు చెప్పారు. ఇందులోభాగంగా పార్టీ ముద్రించిన మినీమేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, గోపాల్, రూప, సిద్దు, రమేష్, ధరణి, కుప్పాల శంకర్, లక్ష్మీపతి, నవాజ్, శేఖర్, బహదూర్ పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి

మదనపల్లె, జనవరి 29: వాహన డ్రైవర్లు రహదారి నియమాలు పాటించాలని మదనపల్లె ఎంవీఐ శివలింగయ్య పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక ఆర్టీవో కార్యాలయంలో వాహనడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగయ్య మాట్లాడుతూ వచ్చే నెల 19వతేదీ వరకూ నెలరోజుల పాటు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులోభాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న 50మందికి ఉచిత కంటివైద్య వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన

ములకలచెరువు, జనవరి 29: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం చౌడసముద్రం పంచాయతీ కనికలతాండాకు చెందిన మహిళలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామంలో రెండు నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కూలీ పనులు మాని తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నామన్నారు. సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో పోలప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు సుజాత, జయమ్మ, నాగులమ్మ, కమలమ్మ, ప్రమీలమ్మ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పీలేరు బస్టాండుకు మరమ్మతులు

పీలేరు, జనవరి 29: ప్రయాణికుల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం పీలేరు ఆర్టీసీ బస్టాండుకు మోక్షం లభించింది. గత ఏడాది డిసెంబరు 29న ఆంధ్రజ్యోతిలో 'కూలిపోతేగానీ కనికరించరా' అన్న శీర్షికన పీలేరు కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఆ సంస్థ ఉన్నతాధికారులు బస్టాండు మరమ్మతుల కోసం రూ.8.54 లక్షలు మంజూరు చేశారు. టెండర్లలో ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు సోమవారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం బండ్ల కుమార్ మాట్లాడుతూ పెచ్చులూడుతున్న పైకప్పు, శిథిలావస్థకు చేరుకున్న పిల్లర్లు, అధ్వాన్నంగా ఉన్న ఫ్లోరింగ్ పనులు చేసేందుకు ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేశారన్నారు. మరమ్మతులు పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యంతో పురిటి బిడ్డ మృతి

● వైద్యుల నిర్వాకంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు


టుటౌన్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

మదనపల్లె టౌన్, జనవరి 29: ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పురిటిబిడ్డ మృతి చెందిందని బాధితులు మదనపల్లె టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.బి.కొత్తకోట మండలం ఆరేటివారిపల్లెకు చెందిన రఘునాథ్ భార్య లలితమ్మ(29) గర్భిణి కావడంతో మూడు నెలలుగా మదనపల్లె పట్టణం టు టౌన్ పోలీసుస్టేషన్ వెనుక వైపు ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతి నెలా పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి లలితమ్మకు నొప్పులు రావడంతో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకురాగా శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. కాగా పురిటి బిడ్డ ఆరోగ్యంగా లేదని బయట చూపించుకోవాలని ఆస్పత్రి యజమాన్యం చెప్పడంతో రఘునాథ్ కుటుంబీకులు మూడు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోయింది. కాగా పురిటిబిడ్డను బెంగళూరు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతుండగా బిడ్డ మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన బాధితులు ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడి నిర్లక్ష్యంపై ఆస్పత్రి వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న టు టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులను, వైద్యుడిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దీనిపై విచారించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

ఆదిమూలం ఆరోపణలపై సమాధానం చెప్పాలి

● మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు నల్లారి డిమాండ్

పీలేరు, జనవరి 29: చిత్తూరు జిల్లా సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన ఆరోపణలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలు ప్రజలకు సమాధానం చెప్పాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో వారిద్దరి ప్రమేయం, పెత్తనంపై ఆదిమూలం ఆదివారం ఆవేదన వ్యక్తం చేయడమే కాకుండా పలు ఆరోపణలు చేశారు. దీనిపై సోమవారం నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సహజ వనరుల దోపిడీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. దళిత నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలను తమ అంగ, ఆర్థిక బలంతో గుప్పెట్లో పెట్టుకుని అరాచకాలు సాగించి తీరా ఎన్నికల సమయంలో వారిని బలిపశువులను చేస్తున్నారని కిశోర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై ముఖ్యమంత్రికి నిజంగా ప్రేమ ఉంటే పెద్దిరెడ్డి కుటుంబంపై విచారణ జరపాలని కిశోర్ డిమాండ్ చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం జనవరి 29 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన పార్వతీ సమేతవిరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో పంచామృతాభిషేకం ఏకవార రుద్రాభిషేకం, అనంతరం స్వామి వారిని సుందరంగా అలంకరించి పంచహారతి, సప్తహారతి, నక్షత్రహారతి, మహా మంగళారతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

షర్మిలను కలిసిన మదనపల్లె నాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 29: మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఎస్‌రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కడపలో ఏపీసీసీ రాష్ట్రఅధ్యక్షురాలు షర్మిలను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో షర్మిల మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవడానికి అందరూ కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె నాయకులు రాష్ట్రమైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, రాష్ట్రమహిళాఉపాధ్యక్షురాలు మీనాకుమారి,జిల్లాప్రధాన కార్యదర్శి వెంకటరమణ,కార్యదర్శి చలపతి, జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడురవి, రూరల్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మహబూబ్‌పీర్, ముబరక్‌ఖాన్ పాల్గొన్నారు.

రేపు జయహో బీసీ సదస్సు

పెద్దతిప్పసముద్రం జనవరి 29 : మండలంలోని టి.సదుం గ్రామంలో ఈ నెల 31 న జరుగు మండల స్థాయి' జయహో బీసీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్ స్వంత గ్రామమైన టి.సదుంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని మండల స్థాయి టీడీపీ, జనసేన నాయకులు కలసి కట్టుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వారం రోజుల్లో అనాథలకు స్థలం కేటాయించాలి

● మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అల్టిమేటం
● సాయంత్రానికి స్థలం ఇస్తామన్న తహసీల్దార్


దీక్షకు మద్దతుగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జనవరి 29: అనాథాశ్రమానికి వారం రోజుల్లో స్థలం కేటాయించాలని అమదనపల్లె టీడీపీ నేత మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులకు డెడ్‌లైన్ విధించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద నాలుగో రోజు నిరసన దీక్ష చేస్తున్న శిబిరం వద్దకు వచ్చిన షాజహాన్‌బాషా మాట్లాడుతూ నాలుగు రోజులుగా అనాథ పిల్లలు, బహుజన సేన నాయకులు నిరసన తెలుపుతున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇదే మార్గంలో వెళ్లిన ఎంపీ మిధున్‌రెడ్డి అటువైపు కూడా చూడలేదన్నారు. వైసీపీ ప్రభుత్వానికి మానవత్వం లేదా? అని ప్రశ్నించారు. వచ్చే శనివారం లోపు అనాథాశ్రమానికి స్థలం కేటాయించకుంటే టీడీపీ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో సాయంత్రానికి కల్లా వైసీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ సబ్‌కలెక్టరేట్ చేరుకుని ఈ విషయమై చర్చించారు. వెంటనే తహసీల్దార్ మహబూబ్ చాంద్ దీక్షా శిబిరానికి చేరుకుని బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందుతో మాట్లాడుతూ బీకేపల్లె పరిధిలో ఇదివరకు చూపిం చిన 20 కుంటల స్థలం అనాథాశ్రమానికి కేటాయించేందుకు అలీనేసన్ నివేదికలు కలెక్టర్ కు పంపుతామన్నారు. కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే మీరు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవచ్చని తహసీల్దార్ చెప్పారు. ఈ సందర్భంగా శ్రీచందు మాట్లాడుతూ ఎట్టకేలకు నాలుగు రోజుల దీక్షతో రెవెన్యూ అధికారులు స్పందించడం సంతోషంగా ఉందని, అనాథపిల్లలకు న్యాయం జరిగిందన్నారు. చైతన్య సర్వీసెస్ నిర్వాహకులు ఆనం దన్, చైతన్య కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక మాఫియా కనపడటం లేదా..?: టీడీపీ


వాల్మీకిపురంలో ఎస్ఈబీ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

వాల్మీకిపురం, జనవరి 29: వాల్మీకిపురం మండలంలో ఇసుక మాఫియా ఆగడాలు ఎస్ఈబీ అధికారులకు కనబడటం లేదా..? అని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి ప్రశ్నించారు. సోమవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మాధవరంపల్లె, మేడికుర్తి రిజర్వాయర్ ప్రాంతాలలో రాత్రి సమయాలలో హిటాచిలు పెట్టి రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా అధికార పార్టీ తొత్తులుగా మారుతున్నారని విమర్శించారు. నీటిపారుదల శాఖ ఉత్తర్వులను కూడా లెక్క లేయడం లేదన్నారు. మండలంలోని కూరపర్తి గ్రామం మొదలుకుని కలికిరి మండలం మహల్ వరకు నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లల, టిప్పర్లలో ఇసుక అక్ర మంగా తరలిపోతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఎస్ఈబీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు కోసూరి చంద్రమౌళి, పీవీ నారా యణ, రాజేంద్రాచారి, నారాయణరెడ్డి, కేకే నాయుడు, గాంధీపేట రెడ్డి, బుజ్జి పాల్గొన్నారు.

డబ్బులిచ్చినా.. మాపేరిట పట్టాలు ఇవ్వడంలేదు

స్పందనలో బాధిత రైతు ఆర్డీవోకు ఫిర్యాదు


స్పందనలో ప్రజల నుంచి సమస్యల తెలుసుకుంటున్న ఆర్డీవో

మదనపల్లె టౌన్, జనవరి 29:తమ ఆధీనం లో ఉన్న డీకేటీ భూములకు ప ట్టాలు ఇప్పి స్తామని డబ్బులు తీసుకున్నా ఇంత వరకు ఇవ్వడంలేదని బాధిత రైతు ఆర్డీవో మురళికి స్పందనలో ఫిర్యాదు చేశాడు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్ర మానికి అర్జీలు వెల్లువలా వచ్చాయి. ఈసం దర్భంగా నిమ్మనపల్లె మండలం పారేసువారిపల్లెకు చెందిన రైతు పారేసు లక్ష్మ య్య మాట్లాడుతూ నిమ్మనపల్లె మండలం బండ్లపై గ్రామంలో సర్వే నెంబర్‌లో బ్రమ రాంబపేరిట ఉన్న సర్వే నెంబర్ 435లో 2.58 ఎకరాలు డీకేటీ భూమి ఉందన్నారు. ఈ భూమిని తాము అనుభవించు కుంటున్నామని, దీనికి మా పేరిట డీకేటీ పట్టా మార్పు చేయాలని కోరితే అప్పటి ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్వో రాజగోపాల్ రూ.2.50లక్షలు ఖర్చు అవుతుందంటే తాను రూ.1.50లక్షలు నగదు ఇచ్చానన్నారు. కాని వారిద్దరు బదిలీపై వెళ్లిపోయారని, తనకు న్యాయం చేయాలని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మదనపల్లె పట్టణం బీకేపల్లె సర్వే నెంబర్ 548లో గాంధీపురం, కుమారపురం దళితులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించుకుంటున్నారని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తలారి రాధ, సీపీఐ పట్టణ కార్యదర్శి మురళి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మండలంలోని కోళ్లబైలు, పొన్నేటిపాలెంకు వెళ్లే దారిలో నక్కలదిన్నె తాండాకు చెందిన గిరిజనులు సరైన రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని నక్కలదిన్నె తాండా గిరిజనులు ఆర్డీవోకు విన్నవించుకున్నారు. సర్వే చేయించి దారి సమస్య పరిష్కరించాలని కోరారు.

విద్యుత్తు సమస్యలపై అభిప్రాయాలు చెప్పండి

●ట్రాన్స్‌కో ఈఈ యుగంధర్, రైతులకు పిలుపు

మదనపల్లె, జనవరి 29: విద్యుత్తు ఛార్జీల పెరుగుదల, వాటిపై అభ్యంతరాలను సవివరంగా అభిప్రాయాలు తెలియజేయాలని ట్రాన్స్‌కో ఈఈ యుగంధర్ రైతులను కోరారు. తిరుపతి రోడ్డులోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు వినియోగదారులు, ప్రజల నుం చి అభిప్రాయసేకరణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులోభాగంగా మదనపల్లె, పుంగనూరు డివిజన్లలోని రైతులు ఇక్కడి కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్ ద్వారా (వీడియోకాన్ఫరెన్స్) తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు ఇవ్వొచ్చని ఈఈ పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిషన్ ఏటా రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రకటించి విద్యుత్తు చార్జీలు పెరుగుదల, అభ్యంతరాలు, విద్యుత్తు నాణ్యత, సరఫరాపై అభిప్రాయాలు తెలిపేందుకు పేర్లు నమోదు చేసుకున్న రైతులు..ప్రస్తుతం విశాఖపట్నంలో జరుగుతున్న సమావేశం దృష్టికి తీసుకెళ్లాలని ఈఈ కోరారు. ఈ సమావేశంలో పుంగనూరు ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీఈ, ఏఈ రెడ్డిమోహన్, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి..ప్రజాస్వామ్యానికి విలువ ఇవ్వడం నేర్చుకోండి

తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

ములకలచెరువు, జనవరి 29: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రజాస్వామ్యానికి విలువ ఇవ్వడం నేర్చుకోవాలని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. మదనపల్లెలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరులో జరిగిన టీడీపీ అధినేత చం ద్రబాబు నాయుడు బహిరంగ సభ చూసి వైసీపీలో వణుకు పుట్టిందన్నారు. పీలేరుకు వచ్చిన అశేష జనవాణిని చూసి ఓర్వలేక చంద్రబాబుపై మంత్రి పెద్దిరెడ్డి ఇష్టం వచ్చి నట్లు మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. మంత్రి పదవిలో ఉండి అరాచకాలను ప్రోత్స హిస్తున్నారన్న విషయం ప్రజలకు అర్థమైం దన్నారు. స్థానిక సంస్థల, తిరుపతి పార్లమెంటు ఎన్నికల్లో ఏ విధంగా దొంగ ఓట్లు వేయించుకుని గెలిచారో అందరికి తెలుసునన్నారు. దొంగ ఓట్లతో అన్నయయ్య జిల్లా కలెక్టర్ సస్పెండ్‌కు కారణమయ్యారన్నారు. బీసీలపై మీరు ఈ రోజు చూపుతున్న కపటప్రేమ అందరికి తెలుసునన్నారు. వైసీపీ అరాచక దుర్మార్గపు పాలనను సాగనంపేం దుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి దాతలు రూ.లక్ష విరాళం


ఆలయ సిబ్బందికి విరాళం అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, జనవరి 29:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు రూ.లక్ష విరాళం అందజేశారు. ఇందులో భాగంగా బెంగ ళూరుకు చెందిన గోపాల్‌రెడ్డి రూ.50 వేలు, అలాగే రెడ్డెమ్మ, రెడ్డిశంకర్ దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో మంజులకు అంద జేసి అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరారు. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దాతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, జనవరి 29: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని మదనపల్లె నుంచి సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ పెన్షనర్ల రాష్ట్రస్థాయి సమావేశం సోమవారం కడపలో ఏపీ పెన్షనర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్, రాష్ట్రకార్యదర్శి పెద్దన్నగౌడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మునిగోపాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఐక్యమత్యంతో డిమాండ్లను పరిష్కరించుకుందామన్నారు. హెల్త్‌కార్డులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.